JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజ్‌గిరి | శనివారం 20-06-2026
Medchal - Malkajgiri | Saturday 20-06-2026
Follow: jayabherinews
సంపుటి : 03 | సంచిక : 19
పేజీలు : 8 | వెల : 5
Vol. 03 | Issue 19 | Pages : 8 | ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




# యంగ్ ఇండియా వెల్కం కిట్స్ పంపిణీ

**విద్యార్థినీ విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసి వారిని సమాజంలో గొప్ప పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా, స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే తన సంకల్పమని పేర్కొన్నారు.**

జయభేరి, హైదరాబాద్ :

"విద్యార్థులు బాగా బాగా చదువుకోవాలి. చదువుకోవడానికి ఏం కావాలో సమకూర్చే బాధ్యత నేను తీసుకుంటా. పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, లంచ్, స్నాక్స్ కాకుండా భవిష్యత్తులో రవాణా సౌకర్యం కల్పించాలని ఆలోచన చేస్తున్నాం. రాష్ట్రంలో 27.50 లక్షల మంది విద్యార్థులకు యంగ్ ఇండియా స్టూడెంట్స్ కిట్స్ అందిస్తున్నాం. తెలంగాణను ఒక ఎడ్యుకేషన్ హబ్‌గా, స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నదే నా సంకల్పం" అని ముఖ్యమంత్రి అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వం ఎల్‌బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు కిట్స్ పంపిణీతో పాటు విద్యా రంగానికి సంబంధించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఇదే సందర్భంగా మాదక ద్రవ్యాల నియంత్రణపై చైతన్యం కలిగించడానికి స్కూల్, కాలేజీ విద్యార్థులందరితో ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు గవర్నర్ తో కలిసి ముఖ్యమంత్రి ఎగ్జిబిషన్ స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్, సలహాదారు కె. కేశవరావుతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, వేలాదిగా తరలివచ్చిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు ఆత్మగౌరవంతో చదువుకోవడానికి వీలుగా అన్ని రకాల వస్తువులతో కిట్స్ అందజేస్తున్నాం. ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థులను ఆశీర్వదించిన శివ ప్రతాప్ శుక్ల కి ప్రత్యేక ధన్యవాదాలు" అని అన్నారు. "విద్యా రంగాన్ని వికాసం వైపు నడిపించాలన్న లక్ష్యంతో బడ్జెట్‌లో ఆ రంగానికి రూ. 26,600 కోట్లు

...మిగతాది 2 లో

మాదక ద్రవ్యాల మహమ్మారిని తరిమికొట్టడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా వాటిని నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వామ్యం చేసింది. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థినీ విద్యార్థులతో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, సలహాదారు కె. కేశవరావుతో పాటు ప్రజాప్రతినిధుల సమక్షంలో ఎల్ బీ స్టేడియం వేదికగా గవర్నర్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. "నేను మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత జీవన శైలిని అనుసరిస్తూ, నాతో పాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్గర్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంతో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేస్తున్నాను" విద్యార్థులంతా ప్రతిజ్ఞ చేశారు.

# ప్రపంచ దేశాలకు తెలుగు రాష్ట్రాల పవర్



- ఫ్రెంచ్ అధ్యక్షుడికి 'కలంకారీ మహాభారతం' పెయింటింగ్
- స్లోవేకియా ప్రధానికి 'కాశ్మీరీ సిల్క్ కార్పెట్'.. అధ్యక్షుడికి 'హిమ్రూ' టై
- స్పీకర్‌కు ఆయుర్వేద గ్రంథాలు.. బిహార్ స్పెషల్ 'థెకువా'

జయభేరి, న్యూఢిల్లీ :

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన రెండు దేశాల (ఫ్రాన్స్, స్లోవేకియా) పర్యటనను విజయవంతంగా ముగించుకుని శుక్రవారం స్వదేశానికి చేరుకున్నారు. ఈ పర్యటన కేవలం ఉన్నత స్థాయి దౌత్య చర్చలకే పరిమితం కాకుండా, భారతీయ హస్తకళల విశిష్టతను, వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా సాగింది. మన దేశ చరిత్ర, ప్రాంతీయ సంప్రదాయాలతో ముడిపడి ఉన్న అరుదైన కళాఖండాలను ఆయా దేశాల అధినేతలకు బహుమతులుగా ఇవ్వడం ద్వారా ప్రధాని మోదీ 'సాంస్కృతిక దౌత్యాన్ని' అత్యంత

...మిగతాది 2 లో

# ట్రంప్ మీ మాటలు జాగ్రత్త



- నేనేం మీతో ఫొటో కోసం అడుక్కోలేదు..
- ఇచ్చి పడేసిన మెలోనీ

జయభేరి, న్యూఢిల్లీ :

ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీ7 సదస్సులో తనతో ఫోటో దిగేందుకు మెలోనీ వేడుకున్నారని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఆమె పూర్తిగా ఖండించారు. ఈ వ్యాఖ్యలు అసత్యమని పేర్కొంటూ సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు. ప్రపంచ నాయకులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంలో పేరుగాంచిన ట్రంప్, ఈసారి ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీపై వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు అనంతరం ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఒక ఇటాలియన్ మీడియా సంస్థకు

...మిగతాది 2 లో



# 'రైతు డిక్లరేషన్'ను రేవంత్ సర్కార్ బొంద పెట్టింది

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు

జయభేరి, సిద్దిపేట :

మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ కేబినెట్ తీసుకున్న వ్యవసాయ వ్యతిరేక నిర్ణయాలను, అసంపూర్తిగా ఉన్న రైతుబంధు, నిలిచిపోయిన రైతుబీమా తదితర అంశాలను ఆయన తీవ్రంగా మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డిరు రాహుల్ గాంధీ జన్మదినం రోజే కాంగ్రెస్ 'రైతు డిక్లరేషన్'ను బొందపెట్టారు. వరంగల్లో రాహుల్ గాంధీ ప్రకటించిన డిక్లరేషన్లో అన్ని పంటలకు మద్దతు ధరతో పాటు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించారు. కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి గారు బోనస్ లేదు, అన్ని పంటలను రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు కూడా కొనుగోలు చెయ్యదు అని తేల్చి చెప్పారు. కేంద్రం ఏ పంట కొనమంటే ఆ పంట, ఎంత కొనమంటే అంతే కొంటామని కాంగ్రెస్

...మిగతాది 2 లో

# రాష్ట్రంలో ప్రభుత్వం కాదు.. మాఫియా నడుస్తోంది

- కాంగ్రెస్ పాలన చూసి ప్రజలు పూర్తిగా విసిగిపోయారు
- ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలంగాణలో ఎగిరేది గులాబీ జెండానే
- ఇప్పటినుంచే కార్యకర్తలే కథానాయకులై కదంతొక్కాలి
- ఎస్.ఐ.ఆర్ లో అర్హులైన ఓట్లు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోండి
- పార్టీ సభ్యత్వ నమోదును యాప్ ద్వారా ఇంటింటికి వెళ్లి విజయవంతం చేయండి



జయభేరి, హైదరాబాద్ :

మల్కాజ్ గిరి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రంలో గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం నడవడం లేదని, కేవలం మాఫియా మాత్రమే రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రాష్ర నలుమూలలా ఎవరిని కదిలించినా కాంగ్రెస్ అరాచక పాలనపై ప్రజలు పూర్తిగా

...మిగతాది 2 లో

# నా కొడుకు బతికుంటే చూపించండి



- సాయికృష్ణ తల్లికి సీఎం చంద్రబాబు హామీ

జయభేరి, విజయవాడ :

విజయవాడలోని కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ అదృశ్యం వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో న్యాయం చేయాలని కోరుతూ సాయికృష్ణ తల్లి గాదె విజయలక్ష్మి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. తన కుమారుడి అదృశ్యానికి సంబంధించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి నిజానిజాలు వెలికితీయాలని, కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె ముఖ్యమంత్రిని కోరారు. విజయలక్ష్మితో ప్రత్యేకంగా మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మొత్తం ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కేసులో ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తోందని, ఎలాంటి ఒత్తిళ్లకు తావు

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## యంగ్ ఇండియా వెల్కం కిట్స్

(8.5 శాతం) నిధులు కేటాయించాం. దీన్ని ప్రభుత్వం ఖర్చుగా కాకుండా భవిష్యత్తుకు పెట్టుబడిగా భావిస్తోంది. రేపటి భవిష్యత్తుకు బలమైన ఆర్థిక పునాదులు వేయాలి. దేశ భవిష్యత్తు సంక్షేమ హాస్టళ్లలో ఉంది" అని పేర్కొన్నారు. "గ్రామీణ ప్రాంతాలు, తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని భావిస్తున్నాం. ప్రతి పేదవాడి గుండెను తట్టాలని విద్యా శాఖను నిరంతరం పర్యవేస్తున్నా. అత్యంత నిరుపేద తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంగ్లీషులో చదువుకోవాలని, భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటారు. వారి కోసం ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ ప్రారంభించాం" అని ముఖ్యమంత్రి సభలో వివరించారు. వారి కలలను సాకారం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఎవరేమనుకున్నా నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు ఒక స్పష్టమైన విధానం ఉండాలని విద్యా పాలసీని తెచ్చామని గుర్తుచేశారు. "ఆరుట్లలో ఏర్పాటు చేసిన TelanganaModelSchool ఆదర్శంగా నిలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో నో అడ్మిషన్ అని బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరు. ఉపాధ్యాయులు ఎంతో శ్రమించి పనిచేశారు. ప్రతి నియోజకవర్గానికి ఒక పబ్లిక్ స్కూల్ అందిస్తున్నాం" అని చెప్పారు. "విద్యా రంగంలో తెలంగాణ ను దేశానికి రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతాం. చదువుకోవడానికి ఏం కావాలో సమకూర్చే బాధ్యత నేను తీసుకుంటా" అని విద్యార్థులకు భరోసానిచ్చారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఆయా పాఠశాలల విద్యార్థులకు కిట్‌స్‌ను అందించి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. గవర్నర్ తో కలిసి ముఖ్యమంత్రి "అన్న అక్క మెంటార్షిప్" కార్యక్రమాన్ని ఆవిష్కరించారు.

## ప్రపంచ దేశాలకు తెలుగు.. పవర్

ప్రభావవంతంగా ఉపయోగించారు. అంతర్జాతీయ బంధాలను మరింత బలోపేతం చేసేలా ప్రధాని అందించిన ఆ అద్భుతమైన కానుకల విశిష్టతలు తెలుసుకుందాం.

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హస్తకళా నైపుణ్యంతో కూడిన 'కలంకారీ మహాభారతం పెయింటింగ్'ను బహుమతిగా ఇచ్చారు. సాంప్రదాయ పెన్‌డ్రాయింగ్ పద్ధతిలో, దాదాపు ఆరు నెలల పాటు శ్రమించి ఈ అద్భుతమైన కళాఖండాన్ని రూపొందించారు. కర్తవ్యం, న్యాయం, ధైర్యం వంటి నైతిక విలువలను ప్రతిబింబించే మహాభారత ఘట్టాలతో పాటు.. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధిస్తున్న దృశ్యం ఇందులో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. శాంతి, మానవ గౌరవం, నైతిక నాయకత్వం వంటి సార్వత్రిక విలువలను ఈ పెయింటింగ్ చాటిచెబుతోంది. అలాగే మాక్రాన్ భార్య బ్రిగిట్టే మాక్రాన్‌కు తెలంగాణకు చెందిన ప్రసిద్ధ 'పోచంపల్లి సిల్క్ స్టోల్'ను (మగ్గం/దుపట్టా) అందజేశారు. సాంప్రదాయ 'ఇక్కత్' డైయింగ్ పద్ధతిలో జ్యామితీయ, పూల డిజైన్లతో చేసిన ఈ సిల్క్ స్టోల్.. ఫ్యాషన్, కళలను అమితంగా ఇష్టపడే ఫ్రాన్స్ సంస్కృతిని విశేషంగా ఆకట్టుకుంది. స్లోవేకియా ప్రధాన మంత్రి రాబర్ట్ ఫికోకు ప్రధాని మోదీ ప్రపంచ ప్రసిద్ధి గాంచిన 'కాశ్మీరీ సిల్క్ కార్పెట్'ను కానుకగా ఇచ్చారు. శ్రీనగర్ ప్రాంతానికి చెందిన నైపుణ్యం కలిగిన హస్తకళాకారులు సహజమైన పట్టుతో, ఎంతో శ్రమించి నెలల తరబడి నేసిన ఈ కార్పెట్ విలాసవంతమైన కళాఖండంగా గుర్తింపు పొందింది. ఇక స్లోవేకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రినికి ఔరంగాబాద్ (ఛత్రపతి శంభాజీ నగర్) సంప్రదాయ 'హిమ్రూ సిల్క్ స్కార్ఫ్' సెట్‌ను అందించారు. భౌగోళిక గుర్తింపు పొందిన ఈ వస్త్రం దాని అద్భుతమైన పూల డిజైన్లతో రాజసం ఉట్టిపడేలా ఉంటుంది. దీనితో పాటు ప్రతాప్‌గఢ్‌కు చెందిన పురాతన 'థేవా' జ్యువెలరీ కళతో బంగారు రేకులను రంగుల గాజుపై అమర్చి రూపొందించిన అరుదైన కఫ్ లింక్స్‌ను కూడా అధ్యక్షుడికి బహుమతిగా ఇచ్చారు. స్లోవేకియా పార్లమెంట్ స్పీకర్ రిచర్డ్ రాసికి భారతీయ వైద్య విజ్ఞానానికి ప్రతీకలైన 'చరక సంహిత', 'సుశ్రుత సంహిత' గ్రంథాలను ప్రధాని మోదీ అందజేశారు. మానవ శరీర ధర్మశాస్త్రం, ఆరోగ్యంపై రెండు వేల ఏళ్ల నాటి శాస్త్రీయ అవగాహనకు చరక సంహిత నిదర్శనంగా నిలిస్తే.. ప్రాచీన ప్లాస్టిక్ సర్జరీ (రైనోప్లాస్టీ) మరియు శస్త్రచికిత్స పరికరాల విజ్ఞానాన్ని వివరించే తొలి గ్రంథంగా సుశ్రుత సంహిత ప్రపంచ వైద్య చరిత్రలో మైలురాయిగా నిలిచింది. వైద్య గ్రంథాలతో పాటు స్పీకర్ రిచర్డ్ రాసికి బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో పండగలలో (ముఖ్యంగా ఛఠ్ పూజలో) ఎంతో పవిత్రంగా తయారుచేసే సాంప్రదాయ తీపి వంటకం 'ఠెకువా'ను కూడా ప్రధాని మోదీ రుచి చూపించారు. గోధుమ పిండి, బెల్లం, నెయ్యితో చేసే ఈ వంటకం భారతీయ గ్రామీణ పండగ సంస్కృతిని, సుదీర్ఘ కాలం నిల్వ ఉండే భారతీయ ఆహార వారసత్వాన్ని ప్రతిబింబిస్తుంది. మొత్తానికి ప్రధాని మోదీ తన పర్యటన ద్వారా భారతీయ సంస్కృతిని, కళలను ప్రపంచ దేశాల అధినేతలకు పరిచయం చేస్తూ సాగించిన ఈ 'గిఫ్ట్ డిప్లొమసీ' అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్టను మరింత పెంచింది.

## ట్రంప్ మీ మాటలు జాగ్రత్త

ఇచ్చిన ఫోన్ ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, జూన్ 15 నుంచి 17 వరకు ఫ్రాన్స్‌లోని ఎవియన్ నగరంలో జరిగిన జీ7 సమావేశంలో మెలోనీ తనతో ఫోటో దిగేందుకు ఎంతో ఆసక్తి చూపించారని అన్నారు. తనతో మాట్లాడేందుకు ఆమె ఉత్సాహంగా ఉన్నారని, తనతో ఒక ఫోటో కోసం పదేపదే ప్రయత్నించారని వ్యాఖ్యానించారు. తాను సాధారణంగా ఫోటోలు దిగనప్పటికీ, ఆమెపై జాలి వేసి అంగీకరించానని కూడా చెప్పారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన జార్జియా మెలోనీ, ట్రంప్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియోలో మాట్లాడుతూ, "డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా కల్పితం, అబద్ధం. అమెరికా అధ్యక్షుడు తన మిత్ర దేశాల నాయకుల పట్ల ఇలాంటి ప్రవర్తన ఎందుకు ప్రదర్శిస్తున్నారో అర్థం కావడం లేదు. ఇది ఆయనకు మొదటిసారి చేస్తున్న పని కాదు" అని అన్నారు. అంతేకాకుండా, ట్రంప్ తన మిత్రులను అవమానించడంలో ముందుంటారని, కానీ పాశ్చాత్య దేశాలకు వ్యతిరేకంగా ఉన్న శక్తులు, నియంతల విషయంలో మాత్రం మృదువుగా వ్యవహరిస్తారని విమర్శించారు. "నేను, నా దేశం ఇటలీ ఎప్పుడూ ఎవరి ముందు వేడుకోరు, భిక్ష అడగరు" అని మెలోనీ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యల తర్వాత వివాదం మరింత ముదిరింది. ఇది కేవలం ఇద్దరు నాయకుల మధ్య మాటల యుద్ధంగా కాకుండా, రెండు దేశాల దౌత్య సంబంధాలపై కూడా ప్రభావం చూపే అంశంగా మారింది. ట్రంప్ వ్యాఖ్యలపై ఇటలీలో అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ఇటలీ ఉప ప్రధానమంత్రి ఆంటోనియో తజానీ జూన్ 21, 22 తేదీల్లో జరగాల్సిన తన అధికారిక అమెరికా పర్యటనను తక్షణమే రద్దు చేసినట్లు సమాచారం.

## మాఫియా నడుస్తోంది

విసిగిపోయారని, అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెలంగాణలో ఎగిరేది ముమ్మాటికీ గులాబీ జెండా మాత్రమేనని స్పష్టంచేశారు. ఇవాళ మల్కాజిగిరిలో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్లపాటు అభివృద్ధి, సంక్షేమం జోడెద్దు మాదిరిగా ముందుకు సాగాయని కేటీఆర్ తెలిపారు. 2014కు ముందు ఎండాకాలం వచ్చిందంటే చాలు కరెంట్ కష్టాలతో ప్రజలు అల్లాడిపోయేవారని గుర్తుచేశారు. అపార్ట్‌మెంట్లు, దుకాణాల వద్ద జనరేటర్ల మోత మోగేదని, ప్రజలు జేబులు ఖాళీ అయ్యేవని తెలిపారు. పరిశ్రమలకు మూడురోజులు పవర్ హాలిడేలు ప్రకటిస్తే, ఇందిరా పార్క్ వద్ద ధర్నాలు చేసే దుస్థితి ఉండేదని కేటీఆర్ స్పష్టంచేశారు. కరెంట్ తోపాటు తాగునీటి కూడా తండ్లాట ఉండేదని, ఖైరతాబాద్‌లోని జలమండలి ముందు ఖాళీ బిందెలతో ప్రతినిత్యం ధర్నాలు, నిరసనలు హోరెత్తిపోయేవని అన్నారు. కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల్లోనే ఆరు దశాబ్దాల కరెంట్ సమస్యను శాశ్వతంగా తీర్చారని, లక్ష కోట్లు ఖర్చుపెట్టి అటు వ్యవసాయానికి, ఇటు గృహ అవసరాలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. 200 ఉన్న పెన్షన్ 2000 కు పెంచుకున్నామని, ఒక్క హైదరాబాద్‌లోనే లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టామని తెలిపారు. 3500 డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చుకున్నామని తెలిపారు. 15 లక్షల మంది ఆడబిడ్డల పెండ్లిళ్లకు కళ్యాణలక్ష్మి కింద లక్ష రూపాయలు అందించిన ఘనత కన్న మేనమామ కేసీఆర్ గారు అని వెల్లడించారు. ట్రైలర్ చూస్తేనే సినిమా హిట్టో, ఫట్టో చెప్పే రోజులివని, అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సగం సినిమా అట్టర్ ఫ్లాప్ అయ్యిందని కేటీఆర్ ధ్వజమెత్తారు.

# డేంజర్ లో 200 జిల్లాలు



12 రాష్ట్రాలపై ఎల్‌నినో పంజా.. ఇదైతే పక్కా. దాదాపు 60 శాతం దేశాన్ని కబళించబోతోంది ఎల్‌నినో రక్కసి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన హైఅలర్ట్ ఇది. ఖరీఫ్ సీజన్‌ను మొదట్లోనే తుంచి పడేసేలా, వీలైతే రబీని కూడా డ్యామేజ్ చేసేలా, ఇప్పటికే కరవు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. విషాదం ఏంటంటే, ఎల్‌నినో పీడిత 12 రాష్ట్రాల్లో మన తెలుగు రాష్ట్రాలు కూడా ఉన్నాయి. సాగునీటి కోసం రైతాంగం, తాగునీటి కోసం సామాన్య జనాభా అలమటిస్తోంది. ఎల్‌నినో ఎఫెక్ట్ దేశాన్ని ఎటు తీసుకెళ్తుందిఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయం దెబ్బతింటుందన్న భయాందోళనలు నెలకొన్నా మరోవైపు కేంద్రం వద్ద ప్రస్తుతం భారీగా ఆహారధాన్యాల నిల్వలు ఉండడంతో ఆహారభద్రతపై ఎలాంటి ఎల్‌నినో ప్రభావం ఉండబోదని కేంద్ర ప్రభుత్వం భరోసా ఇస్తోంది. అయితే ఈ నిల్వలను వృథా కాకుండా సరిగ్గా పంపిణీ, విక్రయాలు సాగించగలిగితేనే ధరలు అదుపులో ఉంటాయి. దీనికి ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్ అనే పథకాన్ని అమలు చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఏర్పడే వర్షాభావంతో దేశంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 200కు పైగా జిల్లాల్లో వ్యవసాయానికి ముప్పు వచ్చే పరిస్థితులు కమ్ముకొస్తున్నాయి. ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉన్న 12 రాష్ట్రాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కూడా ఉన్నాయి. వర్షాలు సకాలంలో పడకపోవడంతో వరి వంటి నీటి అవసరాలపై ఎక్కువగా ఆధారపడే పంటల ఉత్పత్తికి ముప్పు ఏర్పడుతుంది. అయితే ప్రస్తుతం కేంద్రం వద్ద జూన్ 1 నాటికి రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల నిల్వలు 122 మిలియన్ టన్నుల వరకు ఉండడం విశేషం. ఏడాది పొడుగునా వరి వినియోగానికి ఇవి సరిపోతాయి.

మొత్తం నిల్వల్లో 68.43 మిలియన్ టన్నుల వరి, 53.41 మిలియన్ టన్నుల వరకు గోధుమలు ఉన్నాయి. ఈ భారీ నిల్వల్లో సుమారు 80 కోట్ల మందికి పైగా లబ్ధిదారులకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందించాలంటే ఏటా 56 మిలియన్ టన్నులు అవసరం కాగా, ప్రస్తుత నిల్వలు దాదాపు రెండేళ్లపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఉచితంగా సరఫరా చేయడానికి సరిపోతాయి. అందువల్ల దేశానికి ఆహార భద్రతపై భరోసా లభిస్తోంది. ఎల్‌నినో ప్రభావం వల్ల సాధారణ వర్షపాతం నమోదు కాకపోయినా ప్రాథమిక ఆహార లభ్యతకు ఎలాంటి ఢోకా లేదు. ఓపెన్ మార్కెట్ సేల్ స్కీమ్ (ఒఎంఎస్‌ఎస్) ద్వారా గోధుమ, బియ్యం వంటి ఆహార ధాన్యాలను రాష్ట్ర ప్రభుత్వాలతోసహా భారీ సంఖ్యలో వినియోగదారులకు విక్రయించవచ్చు. రాష్ట్ర ప్రభుత్వాలు తమ సంక్షేమ పథకాల కోసం ఎఫ్‌సిఐ నుండి నేరుగా ఆహార ధాన్యాలను కొనుగోలు చేయవచ్చు. ఆహార భద్రతను నిర్వహించడం, నిల్వలు వృథా కాకుండా చూడడం, మార్కెట్లో ధరలను అదుపులో ఉంచడం ఈ ఒఎంఎస్‌ఎస్ పథకం ఉద్దేశం.

2025, 26లో ఆహార ధాన్యాల ఉత్పత్తి 176.04 మిలియన్ టన్నులు కాగా, అంతకన్నా ఎక్కువగా 176.16 మిలియన్ టన్నుల ఉత్పత్తిని 2026 27లో సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో 123.15 మిలియన్ టన్నుల వరి, 8.4 మిలియన్ టన్నుల కాయధాన్యాలు, 28.92 మిలియన్ టన్నుల చమురు గింజలు, 13.56 మిలియన్ టన్నుల చిరుధాన్యాలు. 31.04 మిలియన్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి చేయాలని చూస్తున్నారు. అయితే ఆహార ధాన్యల సద్వినియోగానికి ఒఎంఎస్‌ఎస్ పథకానికి భారీ కేటాయింపులు అవసరమని, ఇథనాల్ (ఇంధనం) ఉత్పత్తి కోసం సబ్సిడీ ధరలో బియ్యం కోటా కేటాయింపును తగ్గించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భారత ఆహార సంస్థ దగ్గర ఉన్న బియ్యాన్ని క్వింటాలుకు రూ. 2320 వంతున భారీ సబ్సిడీతో గతంలో ప్రభుత్వం కేటాయించింది.

అయితే పెరుగుతున్న ఆహార భద్రత ఆందోళనలు, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో బియ్యం నిల్వలను కాపాడుకోవాలని, ధరల పెరగకుండా అదుపులో ఉంచడానికి ఈ కేటాయింపులు భారీగా తగ్గించాలని మాజీ అగ్రికల్చరల్ సెక్రటరీ సిరాజ్ హుస్సేన్ సూచించారు. అలాగే ప్రస్తుతం ప్రభుత్వం దగ్గర 4.5 మిలియన్ టన్నుల వరకు పప్పుధాన్యాల నిల్వలు ఉన్నాయి. వీటి ధరలను అదుపులో ఉంచడం చాలా అవసరం. ఇదిలా ఉండగా వాతావరణ శాఖ అంచనా ప్రకారం సాధారణ వర్షపాతం 62.1 మిమీ కాగా, జూన్ 15 వరకు 42.4 మిమీ వర్షపాతమే లభించింది. అంటే దేశం మొత్తం మీద 32 శాతం లోటు వర్షపాతం కనిపిస్తోంది. సాధారణంగా దీనిని ఎదుర్కోడానికి కేంద్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా పప్పు ధాన్యాల సాగు చాలా మందకొడిగా ప్రారంభమైంది. గత ఏడాదితో పోలిస్తే ఈ జూన్ 12 నాటికి పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం 43 శాతం తగ్గిపోయింది. కంది, మినుము, పెసర, వంటి పంటల విత్తనాలు విత్తడం భారీగా పడిపోయింది.

కర్ణాటక, మహారాష్ట్రలోని పప్పుధాన్యాల ఉత్పత్తి అత్యధికంగా జరిగే కీలక ప్రాంతాల్లో రైతులు వరుణ కటాక్షం కోసం నిరీక్షిస్తున్నారు. జూన్ 12 వరకు కంది విత్తనాలను 0.09 లక్షల ఎకరాల్లో వేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ కంది సాగు విస్తీర్ణం 57 శాతం తక్కువ. మినుములు 0.27 లక్షల ఎకరాల్లో విత్తగా, గత ఏడాది ఇదే సమయానికి 0.35 లక్షల ఎకరాల్లో వేయడమైంది. అంటే 22 శాతం సాగు విస్తీర్ణం తగ్గింది. గత ఏడాది 1.54 లక్షల ఎకరాల్లో పెసర సాగు చేయగా, ఈ ఏడాది ఇప్పటికి 0.69 లక్షల ఎకరాల్లో విత్తారు. అంటే 55 శాతం సాగు విస్తీర్ణం తగ్గింది.

కర్ణాటక ఈశాన్య ప్రాంతం, మహారాష్ట్రలో కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. మహారాష్ట్రలోని లాతూరు, సోలాపూర్, తెలంగాణ రాష్ట్రంలో బఠానీ పండిస్తారు. లాతూరులో కందిసాగు ఇంకా ప్రారంభం కాలేదు. కర్ణాటకలోని కలబుర్గిలో కొన్ని ప్రాంతాల్లో కొన్ని వారాల క్రితం వర్షాలు పడడంతో పెసర సాగు ప్రారంభించారు. అయితే నాటిన విత్తనాలు నిలదొక్కుకోడానికి వర్షాలు అవసరం. పప్పుధాన్యాలు ప్రధానంగా పండించే మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో కంది, మినుము, వంటి పంటల సాగు జులై మధ్య వరకు చేపట్టినా, పంట చేతికి వచ్చేసరికి చాలా ఆలస్యమవుతుందని రైతులు చెబుతున్నారు.

## 'రైతు డిక్లరేషన్'ను రేవంత్ సర్కార్ బొంద పెట్టింది

ప్రభుత్వం స్పష్టం చేయడం రాహుల్ గాంధీ జన్మదినం సాక్షిగా రైతు డిక్లరేషన్కు బొంద పెట్టడమే. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలు గతంలో మాట్లాడుతూ ఎంతైనా వడ్లు పండించండి, పండించిందంతా మేమే కొంటాం అని రైతులను నమ్మబలికారు. నిన్న కేబినెట్ మీటింగ్ తర్వాత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు మాట్లాడుతూ, పేపర్ మీద రాసుకొచ్చినదాన్ని జాగ్రత్తగా చదివి వినిపిస్తూ.. కేంద్రం మద్దతు ధర నిర్ణయించిన పంటలు ఎంత కొనమంటే, ఏది కొనమంటే అంతే కొంటామని చెప్పారు. ఇది పేపర్ల కేబినెట్ కాదు.. ఇది 'ఫెయిల్యూర్' కేబినెట్. రైతుల పట్ల ఏమాత్రం విశ్వాసం, నమ్మకం లేని విశ్వాస ఘాతకమైన కేబినెట్. ఎన్నికల ముందు చివరి గింజ వరకూ కొంటాం, రూ. 500 బోనస్ ఇస్తాం అని నమ్మించి, ఇప్పుడు బోనస్ లేదు, పంటలు కొనం అని కాంగ్రెస్ ప్రకటించడం రైతులను దారుణంగా మోసం చేయడమేనని అన్నారు. ఈ నిర్ణయానికి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర రైతాంగానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్ల విషయంలో తన బాధ్యతల నుండి పూర్తిగా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రం కొన్నా, కొనకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే అన్ని పంటలూ కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఈ రైతు వ్యతిరేక నిర్ణయాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. వెంటనే ఈ నిర్ణయాన్ని బేషరతుగా ఉపసంహరించుకోవాలని రాష్ట్ర రైతాంగం పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఉత్తమ్ మాటల ప్రకారం కేంద్ర ప్రభుత్వం జొన్నలు, మక్కలు కొనదు. అంటే వచ్చే వానాకాలం నుంచి రాష్ట్ర ప్రభుత్వం కూడా మక్కలు, జొన్నలు కొనమని చేతులెత్తేసినట్టే. కానీ కేసీఆర్ ప్రభుత్వం మక్కలు, జొన్నలు కొని అండగా నిలిచింది. పప్పు దినుసులు, నూనె విత్తనాలైన కందులు, పెసలు, శనగలు, సన్ఫ్లవర్ లాంటి పంటలను కేంద్రం కేవలం 25 శాతం మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఒక రైతుకు ఎకరాకు 12 క్వింటాళ్ల కందులు పండితే, అందులో మీరు 2.5 క్వింటాళ్లు కొని, మిగతా 9.5 క్వింటాళ్లను రైతు బయట మార్కెట్లో అమ్ముకోవాలా? పెసర్లు ఎకరాకు 6 క్వింటాళ్లు వస్తే కేవలం 2 క్వింటాళ్లు కొని మిగతాది రైతు బయట అమ్ముకోవాలా? సన్ఫ్లవర్ ఎకరాకు 810 క్వింటాళ్లు వస్తే రెండు మూడు క్వింటాళ్లు కొని మిగతావి బయట అమ్ముకోమంటావా? రైతుల కష్టాన్ని దళారుల పాలు చేయాలని చూస్తున్నావా రేవంత్ రెడ్డి? మన దగ్గర వరి విపరీతంగా పండుతుంది. 202122 లో కేసీఆర్ గారి హయాంలో రికార్డు స్థాయిలో 92 లక్షల టన్నులు పండితే, కేంద్రం కొనకపోయినా ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించి కొనుగోలు చేసింది. ఈ సంవత్సరం కేంద్రం 50 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొంటామని ప్రకటించింది. అంటే వచ్చే సంవత్సరం నువ్వు అంతే కొని వదిలేస్తావా? రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను తడిగుడ్డతో గొంతు కోసి దారుణంగా మోసం చేసిందని ఆరోపించారు.

మీకు కనీసం కాసింత రైతుల పట్ల ప్రేమ ఉన్నా, మీరు నిజమైన రైతు బిడ్డ అయితే తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. యూరియా విషయంలో అటు కేంద్రంలోని బీజేపీ, ఇటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఎకరాకు రెండు యూరియా బస్తాలే ఇస్తామని కొత్తగా యాప్ పెట్టి, సర్క్యులర్ జారీ చేసి ఆ రెండు బస్తాల కోసం రైతులను అష్టకష్టాలు పెడుతున్నారు. కనీసం యూరియా సక్రమంగా ఇచ్చే తెలివి కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతులంటే ఎందుకింత చిన్నచూపు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మిర్చి పంట పండుతుంది. దానికి ఎకరాకు ఐదారు బస్తాల యూరియా పడుతుంది. అలాంటిది రెండు బస్తాలు మాత్రమే ఇస్తే మిగతావి ఎక్కడికి పోవాలి. వరికి ఎకరానికి మూడు బస్తాలు అవసరమైతే రెండు ఇస్తామంటే రైతులు ఏం కావాలి. యాప్లు పెట్టి పోలీసు బందోబస్తు మధ్య పోలీస్ స్టేషన్లలో యూరియా పంచడం అత్యంత దారుణం. కేంద్ర ప్రభుత్వం అటు డీజిల్ ధరలు, ఇటు ఎరువుల ధరలు పెంచి రైతు మీద మోయలేని భారం మోపుతోంది, కానీ దానికి తగ్గట్టుగా మద్దతు ధర మాత్రం ఆ స్థాయిలో పెంచడం లేదు. ఎన్నికల ముందు అన్ని పంటలకు బోనస్ అన్నారు, తర్వాత వరికి మాత్రమే అన్నారు, ఆ తర్వాత సన్నాలకు మాత్రమే అన్నారు. ఆ సన్నాల్లో కూడా 33 రకాలకే బోనస్ అన్నారు. ఇప్పుడు నిన్నటి కేబినెట్ తర్వాత షావుకారు లెక్క చల్లగా కేవలం 7 రకాల సన్నాలకు మాత్రమే బోనస్ అంటున్నారు.

ఆ 7 రకాల్లో బీపీటీ 520 లాంటి రకాలకు విపరీతమైన చీడపీడలు ఉంటాయి. దిగుబడి కూడా ఎకరానికి కేవలం 20 క్వింటాళ్లే వస్తుంది. అదే వేరే వరి రకం అయితే 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. తక్కువ దిగుబడి వచ్చే పంట వేస్తే రూ. 500 బోనస్ కంటే రైతే ఎక్కువ లాస్ అవుతాడు. బోనస్ ఇచ్చే రకాలను 33 నుంచి 7 రకాలకు ఎందుకు కుదించారో సమాధానం చెప్పాలి. పోయిన యాసంగికి రూ. 1200 కోట్ల బోనస్ ఎగ్గొట్టారు, ఈ వానాకాలం రూ. 700 కోట్ల బోనస్ ఎగ్గొట్టారు. ఇప్పటికే సగం మంది రైతులు మీరు చెప్పిన 33 రకాల సన్నాలకు సరిపడా నారు కూడా పోశారు, ఇప్పుడు ఆ రైతుల పరిస్థితి ఏంటి. కేసీఆర్ ఏనాడూ రైతుబంధు వేయడానికి మీటింగ్ పెట్టలేదు. సమయానికి ఎలాంటి ఆర్భాటం లేకుండా 11 విడతల్లో రూ. 74 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో వేశారు. కానీ రేవంత్ రెడ్డి ఎకరానికో మీటింగ్ పెడుతున్నాడు. మార్చి 22న సిద్దిపేటకు వచ్చి ఆర్భాటంగా ఒక ఎకరాకు వేశాడు. కేసీఆర్ జగిత్యాల వెళ్లగానే ఇంకో మీటింగ్ పెట్టి మరో ఎకరానికి వేశాడు, నిన్న మధిరలో ఇంకో ఎకరానికి ఇస్తామని ప్రకటించాడు. నర్మెట్టలో ఆయిల్ ఫ్యాక్టరీకి రిబ్బన్ కట్ చేయడానికి వచ్చి కనీసం సిగ్గు లేకుండా 45 రోజుల్లో రైతుబంధు పూర్తి చేస్తామని ఒట్టిగా మాటలు చెప్పావు రేవంత్ రెడ్డీ. 91 రోజులైనా నువ్వు చెప్పిన ఆ తొమ్మిది వేల కోట్లు ఇంకా రైతుల ఖాతాల్లో పడలేదని అన్నారు. ఎన్నికల ముందు రైతుబంధు రూ. 10,000 ఉంటే రూ. 15,000 ఇస్తామని చెప్పావు. కానీ 202425 వానాకాలం రైతుబంధు ఏ ఒక్క ఎకరానికి కూడా ఇవ్వకుండా గుండు సున్నా చేశావు. 2024 25 యాసంగికి మూడెకరాలకు ఇచ్చి మిగతా అందరికీ ఎగ్గొట్టారు. 202526 యాసంగికి రెండెకరాలకు ఇచ్చి మిగతా రైతులకు ఎగ్గొట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ ఐదు పంటలు కలుపుకుని రైతుభరోసా కింద రైతాంగానికి ప్రభుత్వం బాకీ పడిన మొత్తం ఏకంగా రూ. 29,358 కోట్లు. రైతుబీమా గురించి నిన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు మాట్లాడుతున్నారు. జనవరి నుంచి ఇప్పటివరకు ఏ జిల్లాకు వెళ్లినా రైతుబీమా ఆగిందా లేదా అన్నది మీరే సమాధానం చెప్పాలని అన్నారు.

## నా కొడుకు బతికుంటే చూపించండి

లేకుండా నిష్పక్షపాత విచారణ జరుగుతుందని ఆమెకు భరోసా ఇచ్చారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగరాజును సస్పెండ్ చేసినట్లు, కేసు దర్యాప్తును వేగవంతం చేసేందుకు సీనియర్ ఐపీఎస్ అధికారిని విచారణ అధికారిగా నియమించినట్లు తెలిపారు. అంతేకాకుండా, తప్పు చేసిన వారు ఎంతటి హోదాలో ఉన్నా ఉపేక్షించబోమని, సమగ్ర దర్యాప్తు అనంతరం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం అన్ని విధాలుగా కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

ముఖ్యమంత్రి ఇచ్చిన భరోసాపై విజయలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇప్పుడు తమకు న్యాయం జరుగుతుందనే విశ్వాసం కలిగిందని తెలిపారు. ఇదిలా ఉండగా, గాదె సాయికృష్ణపై గతంలో పలు కేసులు నమోదయ్యాయి. ఇటీవల అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం వెలువడింది. అయితే అనంతరం అతడు కనిపించకుండా పోయాడని పోలీసులు చెబుతున్నారు. మరోవైపు, సాయికృష్ణను పోలీసులు హతమార్చారని, దీనిని లాకప్ డెత్‌గా పరిగణించి కేసు నమోదు చేయాలని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో కేసు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. సాయికృష్ణ అదృశ్యానికి సంబంధించిన పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపాయి. సమాచారం ప్రకారం, మార్కాపురం ప్రాంతంలో సాయికృష్ణను విజయవాడ కృష్ణలంక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చాలా రోజుల పాటు అతని ఆచూకీపై స్పష్టత లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో సీఐ నాగరాజు, సాయికృష్ణను చంపేశామని తనకు చెప్పినట్లు విజయలక్ష్మి ఆరోపించడం కేసును మరింత వివాదాస్పదంగా మార్చింది. తన కుమారుడు కనిపించడం లేదంటూ విజయలక్ష్మి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కేసును విచారించిన కోర్టు, సాయికృష్ణను తమ ముందుకు హాజరుపరచాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. అయితే ఇప్పటికీ అతని ఆచూకీపై స్పష్టత రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "నా కుమారుడు బతికి ఉంటే చూపించండి.. లేదంటే కనీసం అతని ఆనవాళ్లు అయినా చూపించండి" అంటూ విజయలక్ష్మి భావోద్వేగానికి గురయ్యారు. ఈ ఘటన రాజకీయంగానూ దుమారం రేపుతోంది. సాయికృష్ణ వ్యవహారంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్న తర్వాత ఏమి జరిగిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదే సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా ఈ అంశాన్ని ప్రస్తావించారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, సాయికృష్ణ మరణానికి పోలీసులు బాధ్యులని ఆరోపిస్తూ, ఇది లాకప్ డెత్ కేసుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై కూడా ఆయన విమర్శలు గుప్పించారు. అయితే ఈ ఆరోపణలపై పూర్తి నిజానిజాలు అధికారిక దర్యాప్తు అనంతరం మాత్రమే వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం ఈ కేసును సీరియస్‌గా తీసుకుని విచారణ కొనసాగిస్తుండగా, సాయికృష్ణ ఆచూకీపై స్పష్టత కోసం కుటుంబ సభ్యులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# చిన్నారుల ఆరోగ్యం.. ఆనందమే అసలైన అభివృద్ధి

- చాంద్రాయణగుట్టలో అంగన్వాడీ-కమ్-పాలన కేంద్రం ప్రారంభం.. మంత్రి సీతక్క

**జయభేరి, హైదరాబాద్ :**




చాంద్రాయణగుట్ట నియోజకవర్గ పరిధిలోని అరుంధతి నగర్‌లో అంగన్వాడీ కేంద్రంకమ్‌పాలన (డే కేర్) కేంద్రాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు యూనిఫాంలు పంపిణీ చేసి, వారి అభ్యాస ప్రదర్శనలను వీక్షించి అభినందించారు. అనంతరం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా..బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్, చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో తొలి పాలన కేంద్రాన్ని చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు సంరక్షణ, పోషకాహారం, ఆటల ద్వారా అభ్యాసం అందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. వేల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ నర్సరీల్లో చేర్పించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ప్రజల ఇంటి వద్దకే నాణ్యమైన సేవలను తీసుకువచ్చిందన్నారు.

అంగన్వాడీ కేంద్రం, పాలన కేంద్రాన్ని ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడం ద్వారా ఒకే కుటుంబంలోని చిన్నారులందరికీ సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉపాధి కోసం బయటకు వెళ్లే తల్లులకు ఈ డే కేర్ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని, పిల్లల సంరక్షణ కోసం మహిళలు తమ ఉద్యోగాలు, ఉపాధిని వదులుకోవాల్సిన పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు చిన్నారుల సంరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా పాలన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల వరకు చిన్నారులను ఈ కేంద్రాల్లో ఉంచి వారి సంరక్షణ బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఆటవస్తువులు, అభ్యాస సామగ్రి, పోషకాహారం అందుబాటులో ఉంచామని చెప్పారు. చిన్నారి జీవితంలోని మొదటి వెయ్యి రోజులు అత్యంత కీలకమైనవని, ఆ దశలో మెదడు ఎదుగుదలతో పాటు శారీరక, మానసిక వికాసం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. అందుకే గర్భధారణ దశ నుంచి తొలి రెండు సంవత్సరాల వరకు తల్లులు, చిన్నారులకు అవసరమైన పోషకాహారం, ఆరోగ్య సేవలు, సంరక్షణ అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. అంగన్వాడీ సేవలను మరింత బలోపేతం చేస్తూ పిల్లలకు విద్యతో పాటు పోషకాహారం, అల్పాహారం కూడా అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ నర్సరీలకు దీటుగా అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతూ 57 రకాల ఆటవస్తువులు, యూనిఫాంలు, నాణ్యమైన ప్రీస్కూల్ విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

మహిళల సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, ఇప్పటివరకు రూ.61 వేల కోట్లకు పైగా రుణాలు అందించామని తెలిపారు. లక్ష కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను మహిళలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు బలంగా ఉన్నట్లే పట్టణ ప్రాంతాల్లో కూడా మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, టీనేజ్ బాలికల కోసం ప్రత్యేక మహిళా సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పేదరిక నిర్మూలనతో పాటు నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం ద్వారా ఇప్పటికే ఆరు లక్షల మంది మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దామని చెప్పారు. పాలన కేంద్రాల్లో చిన్నారుల సంరక్షణ, పోషకాహారం, ప్రారంభ అభ్యాసం ప్రభుత్వ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. "మీ పిల్లలను మాకు అప్పగిస్తే, మీరు నిశ్చింతగా మీ పనులు చేసుకొని రావచ్చు. ప్రతి చిన్నారికి సురక్షిత బాల్యం, ప్రతి తల్లికి భరోసా కల్పించడమే మా ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామచంద్రన్, బోయ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బోయ నగేష్, ఎస్బీఐ ఫౌండేషన్ ప్రతినిధులు, అధికారులు, అంగన్వాడీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## గత కలెక్టర్ కార్యాలయం పక్కనే భారీ అక్రమ నిర్మాణం

# అక్రమ షెడ్డు నిర్మాణం పై చర్యలు ఏవీ..?

- అక్రమ నిర్మాణాలపై అధికారుల నిర్లక్ష్యం ఎందుకు
- అధికారుల బాధ్యత రహిత్యానికి నిదర్శనం ఈ షెడ్డు నిర్మాణం కాదా..?
- అధికారులే అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారా..?
- అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఎండగడతామంటూ స్థానికుల హెచ్చరికలు

**జయభేరి, కీసర :**



కీసర సర్కిల్ పరిధి మేడ్చల్ జిల్లా పాత కలెక్టరేట్ కార్యాలయం పరిసర ప్రాంతంలో భారీ విస్తీర్ణంలో నిర్మాణం చేస్తున్న అక్రమ షెడ్డు నిర్మాణాన్ని తక్షణమే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు నివాసయోగ్యకరమైన ప్రాంతాల్లో చిన్నపాటి గృహ నిర్మాణం చేసుకోవాలంటే ఎన్నో ఆంక్షలు పెట్టే అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా చట్టానికి సవాల్ విసురుతు పెద్ద ఎత్తున నిర్మాణం చేస్తున్న ఈ అక్రమ షెడ్డు నిర్మాణం పై చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారుల తీరు పట్ల ఎన్నో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి కీసర సర్కిల్ ప్రాంతంలో టౌన్ ప్లానింగ్ వ్యవస్థ విధి నిర్వహణలో ఉందా...? లేదా విధి నిర్వహణలో టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నాయెడల నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఈ అక్రమ షెడ్డు నిర్మాణం ఏదేచ్చగా ఎలా కొనసాగుతుందీ...? టౌన్ ప్లానింగ్ అధికారులు విధి నిర్వహణలో ఉండి కూడా ఈ అక్రమ షెడ్డు నిర్మాణంపై చర్యలు తీసుకోకపోవడానికి గల కారణాలు ఏమిటీ...? మామూళ్ల మహత్యమా...? అధికారుల బాధ్యత రహిత్యమా...? అక్రమ షెడ్డు నిర్మాణదారుల దుస్సాహసమా...? అని స్థానికులు మండిపడుతున్నారు, ఇప్పటికైనా అధికారులు ఎలాంటి అనుమానాలకు అపోహలకు తావివ్వకుండా విధి నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరించకుండా తక్షణమే నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఈ అక్రమ షెడ్డు నిర్మాణంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు లేనియెడల ఈ అక్రమ షెడ్డు నిర్మాణం వ్యవహారాన్ని విధి నిర్వహణలో బాధ్యత రహితంగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న అధికారుల వ్యవహారాన్ని జిల్లా కలెక్టర్ తో పాటు జిహెచ్ఎంసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.



# 20న మదనాపురంలో రైతులకు అవగాహన సదస్సు

- బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 20న ఉదయం 10 గంటలకు శాస్త్రవేత్తల ద్వారా రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు దేవరకద్ర నియోజకవర్గం బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. ప్రియతమ నాయకుడు, దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ యొక్క పాలన 12 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామన్నారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే. అరుణమ్మ సుపరిపాలన దినోత్సవం మరియు సేంద్రియ వ్యవసాయం గురించి మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తల ద్వారా రైతులకు ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మతో పాటు పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి మహబూబ్ నగర్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి బిజెపి నాయకులు మరియు కిసాన్ జిల్లా, మండల నాయకులు అందరూ అధిక సంఖ్యలో హాజరుకావాలని కొండ ప్రశాంత్ రెడ్డి కోరారు.

# కబ్జాకు పాల్పడితే చర్యలు తప్పవు

- స.నెం 87/2 సీలింగ్ భూమిని కబ్జాకు గురి కానివ్వం కీసర తహసిల్దార్
- ప్రభుత్వ భూముల పరిరక్షనే ధ్యేయంగా ముందుకు సాగుతాం తహసిల్దార్

**జయభేరి, కీసర :**





ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో చాకచక్యంగా వ్యవహరిస్తామని కీసర మండల తహసిల్దార్ స్పష్టం చేశారు నాగారం గ్రామ పరిధిలోని 87/2 సర్వేనెంబర్ చెందిన సీలింగ్ భూమిని ఆక్రమిస్తూ నిర్మిస్తున్న భవన నిర్మాణాల వ్యవహారంపై తహసిల్దార్ స్పందిస్తూ ఈ సీలింగ్ భూమిని ఆక్రమిస్తూ నిర్మిస్తున్న భవన నిర్మాణాల వ్యవహారాన్ని ఘట్కేసర్ జోనల్ కమిషనర్ తో పాటు హైడ్రా అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని జోనల్ కమిషనర్ తో పాటు హైడ్రా కమిషనర్ సానుకూలంగా స్పందించడం జరిగిందని తెలిపారు ఇప్పటికే 87/2 సర్వే నెంబర్ కు చెందిన సీలింగ్ భూమిని ఆక్రమించి భవన నిర్మాణాలు చేపడుతున్నారనే వినికిడి మేరకు భవన నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చి నిర్మాణం పనులను నిలిపివేయడం జరిగిందని స్పష్టం చేశారు ఈ స్థలం కబ్జాకు పాల్పడుతూ నిర్మించిన భవన నిర్మాణాలు అక్రమ భవన నిర్మాణాలుగా జోనల్ కమిషనర్ హైడ్రా కమీషనర్ ల దర్యాప్తులో తేలినయెడల నిర్మాణదారులపై తగు చర్యలు తీసుకోవడంతో పాటు సీలింగ్ భూమి పరిరక్షణ కోసం పకడ్బందీగా కంచె ఏర్పాటుచేసి ఇట్టి ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించడం జరుగుతుందని వివరించారు.



# అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా కౌకూర్.. భరత్ నగర్

- రెండో దశ సి.సి రోడ్డు నిర్మాణాలు పూర్తి, హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- తుడిమెల్ల మల్లికార్జున్ కు ప్రజల అభినందనల వెల్లువ
- పనులన్ని హన్మంతన్న చొరవతోనే సాధ్యమౌతున్నయ్ - తుడిమెల్ల మల్లికార్జున్

**జయభేరి, కీసర :**

కీసర సర్కిల్ కౌకూర్ లో చాలాకాలంగా పనులు ఆగి దెబ్బతిన్న రోడ్ల సమస్యను చొరవ తీసుకుని పరిష్కరించినందుకు కౌకూర్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ మైనంపల్లి హనుమంత్ రావుకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త శ్రీ తూడిమెల్ల మల్లికార్జున్ మాట్లాడుతూ "కౌకూర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ మైనంపల్లి హనుమంతరావు గారి చొరవతోనే సాకారమయ్యాయి. ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన మైనంపల్లికి కౌకూర్ ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యాప్రాల్ డివిజన్ నాయకులు చిత్ర గోకుల్, బొడ్డు శ్రీనివాస్ యాదవ్, గోకుల్, శివరాజ్, అల్లి మల్లేష్, ఆసిఫుల్లా ఖాన్, సయ్యద్ అస్లాం, అల్లి పాండు, సయ్యద్ అయూబ్, గోమారం అంజి రెడ్డి, కృష్ణ గౌడ్, మాదార్ వల్లి, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న 100 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 19 :**

పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా తుర్కపల్లి మండల కేంద్రంలో పట్టుకున్నట్లు ఎస్సై తగ్గియోద్దీన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పిడిఎస్ బియ్యాన్ని ఆలేరు పరిసర ప్రాంతాల నుండి గజ్వేల్, సిద్దిపేట వైపు తరలిస్తున్న సమాచార మేరకు తుర్కపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా 100 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని కేతావత్ ప్రభాస్ బానోతు శివ లు డిసిఎం వాహనంలో తరలిస్తుండగా తుర్కపల్లిలో పట్టుకొని అట్టి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా పిడిఎస్ బియ్యం తరలించి వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తుర్కపల్లి కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎన్నిక



**జయభేరి, తుర్కపల్లి, జూన్ 19 :**

తుర్కపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ తుర్కపల్లి గ్రామ నూతన కమిటీని మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. టౌన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా కోట జహంగీర్, ప్రధాన కార్యదర్శిగా బొల్లారం జగదీష్, ఉపాధ్యక్షులుగా రొయ్యల మధు, సహాయ కార్యదర్శిగా బండారి శ్రీను, కార్యదర్శిగా కసిర బోయిన గోపాల్, టౌన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్గా ఆకుల అమరేందర్ లను నియమించారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, సర్పంచ్ సోముల వెంకటేశం, ఉప సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్ ,వార్డు సభ్యులు ఎండి నజీర్, సీనియర్ నాయకులు ఎరుకల వెంకటేష్ గౌడ్, పెండెం జ్ఞానేశ్వర్, కోట సురేష్, కూరెళ్ళ బాలకృష్ణ, ఆకుల వెంకటేష్, పాముల రాజు గౌడ్, బోరెడ్డి మహిపాల్ రెడ్డి, పత్తిపాటి హనుమంతరావు, బండారి యాదగిరి, ఎండి గౌస్, అరిగే మైపాల్, జివిలికపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# వాల్మీకి సంఘం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మూసాపేట్ మండలం వేములలో గురువారం వాల్మీకి సంఘం నూతన భవన నిర్మాణానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) శంకుస్థాపన చేశారు. అలాగే ముదిరాజ్ సంఘం భవనాన్ని కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. అంతేకాకుండా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాపతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

**జయభేరి, పరకాల, జూన్ 19:**

పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు, నడికూడ మండలం ధర్మారం గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతూ, యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని కోరారు.దేశ యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న ఆయనకు భగవంతుడు మరింత శక్తి, విజయాలను ప్రసాదించాలని కోరారు.

# పేదలకు అనాథలకు మహా అన్నదానం

- ఫ్రెండ్ అసోసియేషన్



**జయభేరి, తొర్రూర్, జూన్ 19 :**

గాంధీ హాస్పిటల్ ఆవరణంలో వృద్దులు రోజులు పేదల కడుపు నిండాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం మూడు సార్లు బోటు మాంచి పండు ఆధ్వర్యంలో మహా అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తారు.ఫ్రెండ్ రాజేష్,రమేష్ ,ప్రసాద్, దీపక్ ,వెంకట్ ,ప్రతి సంవత్సరం వారికీ వచ్చే జీతంలో ఎంతోకొంత పేద ప్రజలకు సహాయపడాలని పేదల ఆకలి తీర్చాలని అన్నదానం చేస్తారు.ఈ సారి గాంధీ హాస్పటల్ ముందు సుమారు 2వేల మందికి భోజనం ఏర్పాటు చేశామని తెలిపారు.

# దంతాలపల్లిలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

- ఏఎంసీ వైస్ చైర్మన్ బట్టునాయక్



**జయభేరి, దంతాలపల్లి, జూన్19 :**

రాహుల్ గాంధీ 56 వ జన్మదిన వేడుకలు మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ తొర్రూర్ దంతాలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుగులోత్ భట్టు నాయక్ పాల్గొని రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావి భారత కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ అని అన్నారు దేశ ప్రజల శ్రేయస్సు కోసం దేశ బౌతవ్యం కోసం నిరంతరం ఆరాటపడుతూ ఆలోచిస్తూ ముందుకు సాగుతున్న నాయకులు రాహుల్ గాంధీ అని ఆయన అడుగుజాడల్లో యువత ముందుకు సాగాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో దంతాలపల్లి మండలంలోని కాంగ్రెస్ పార్టీయూత్ కాంగ్రెస్ నాయకులు సంపేట సురేష్.బి.ఎల్.ఏలు దామోదర్ రెడ్డి. బాలాజీ. యూత్ అధ్యక్షులు సంపెట సురేష్‌గౌడ్. బొడ్డుపల్లి వెంకన్న. సాయి రెడ్డి. దుండి వెంకటేశ్వర్లు. లింగారెడ్డి. రాంరెడ్డి. మల్లం శీను ఏరుకొండ యాకన్న.

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పెద్దముప్పారంలో బాలవికాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**జయభేరి, దంతాలపల్లి, జూన్19 :**

మండలం ముప్పారం గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెడికేర్ హాస్పిటల్ వాళ్ళు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పాల్గొనడం జరిగింది. మెడికల్ హాస్పిటల్ డాక్టర్ నరేష్ సూపర్వైజర్ రాములు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించిమాట్లాడడం జరిగింది గ్రామంలో ఎండాకాలం వడ దెబ్బ తీవ్రత సీజన్ వ్యాధులుగురించి వివరించడం జరిగింది. ఆరోగ్యంగా ఉన్నవా ళ్లు అసలైన అదృష్టవంతుడు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి టెస్ట్ లో కూడా చేయడం జరిగింది షుగర్ టెస్ట్ బిపి, మరికొన్ని హాస్పటల్ కి వచ్చిన వాళ్లకు 10% ఫ్రీగా చూస్తామన్నారు,కాబట్టి అందరూ సద్వినియోగం చేసుకోవాలి డాక్టర్ మాట్లాడడం జరిగింది. ఇలాంటి అవకాశాన్ని మన గ్రామంలో ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సర్పంచ్ గారు వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భరత్ బాబు డాక్టర్ నరేష్ చైర్మన్ రాములు, బాలవికాసం కోఆర్డినేటర్స్ సుకన్య ,శోభ, యాక లక్ష్మి,స్టాఫ్ సాయి,శిరీష, కీర్తి, సుమతి, ఆశా వర్కర్స్ పద్మ భద్రమ్మ విలేజ్ లీడర్ నాగలక్ష్మి ,రేణుక ,శంకరయ్య, లీడర్లు, సభ్యులు ,గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది

# అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎప్పుడు..?

- కిష్టపూర్ డివిజన్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణలు..
- టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణపై ప్రజల ఆగ్రహం..

**జయభేరి, మేడ్చల్, జూన్ 19:**



మేడ్చల్ సర్కిల్ పరిధిలోని మేడ్చల్, కిష్టపూర్ డివిజన్లు అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగర శివారు ప్రాంతంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతాల్లో అదే స్థాయిలో అక్రమ నిర్మాణాలు వెలుస్తుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ప్రాంత అభివృద్ధి చెందుతుండటం సంతోషకరమైన విషయమైతే, మరోవైపు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మేడ్చల్ సర్కిల్‌లో రోజురోజుకు పెరుగుతున్న అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో జీహెచ్‌ఎంసీ కార్యాలయంలోని కిందిస్థాయి సిబ్బంది ఆగడాలకు అడ్డుకట్ట లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు**

"వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఒకటే" అన్న సామెత మేడ్చల్ సర్కిల్ అధికారుల పనితీరుకు అచ్చొచ్చినట్లు ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు. కిష్టపూర్ డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాల విషయంలో అధికారులు ఉపేక్షించబోమని చెబుతున్నప్పటికీ ఆ ప్రకటనలు కేవలం మాటలకే పరిమితమవుతున్నాయని అంటున్నారు. డివిజన్ పరిధిలో నిత్యం ఏదో ఒకచోట అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. కొందరు జీ+2 అంతస్తుల నిర్మాణాలకు మాత్రమే అనుమతులు తీసుకుని, వాటికి మించి అంతస్తులు నిర్మాణాలు చేస్తుంటే మరికొందరు ఎలాంటి అనుమతులు లేకుండా దర్జాగా నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విధంగా ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ, వాటిని గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం పాటించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

**అధికారుల మౌనం వెనుక కారణాలేమిటి..?**

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారుల మౌనం వెనుక అసలు కారణాలేమిటన్న ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్రమ నిర్మాణాల నిర్మూలన కోసం హైడ్రా వ్యవస్థను తీసుకువచ్చి అక్రమార్కులకు చెక్ పెడుతుంటే, మరోవైపు మేడ్చల్ సర్కిల్‌లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని విమర్శలు వినిపిస్తున్నాయి. కిష్టపూర్ డివిజన్‌లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు ఉన్నతాధికారుల దృష్టికి వచ్చి జరుగుతున్నాయా? లేక కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం లేదా చేతివాటం కారణంగా జరుగుతున్నాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. మేడ్చల్, కిష్టపూర్ డివిజన్లలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# నిరుద్యోగులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం తీరుపై నిరుద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు
- కోచింగ్ సెంటర్లలో చేరి నోటిఫికేషన్లు లేక అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న నిరుద్యోగులు
- ఖాళీగా ఉన్న ఇరవైవేల పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్ వెంటనే విడుదలచేయాలి

నిరుద్యోగుల డిమాండ్

**జయభేరి, షాద్ నగర్. జూన్ 19 :**



త్వరలో త్వరలో నోటిఫికేషన్ అనే పదం వెంటనే విసిగిపోతున్న తెలంగాణ నిరుద్యోగులు. ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో ఇల్లు విడిచి కోచింగ్ సెంటర్లకు పట్నం బయలుదేరిన నిరుద్యోగుల పరిస్థితి రోజురోజుకు దారుణంగా మారుతుంది. సంవత్సరాల కాలం కోచింగ్ సెంటర్ లలో పుస్తకాలతో కుస్తీ పట్టి నిద్రలేని రాత్రులు చదివినా ఇంకా రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే నోటిఫికేషన్ అనే పదాన్ని వాడుతూ నిరుద్యోగులను పక్కదారి పట్టించి కాలయాపన చేస్తుందని నిరుద్యోగులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కోచింగ్, హాస్టల్లలో వసతులకు డబ్బు కట్టలేక తీవ్ర ఇబ్బంది పడుతున్న నిరుద్యోగులు...!!**

జాడలేని జాబ్ క్యాలెండర్. లక్షల రూపాయలు అప్పుచేసి హైదరాబాద్ నగరంలో పలు కోచింగ్ సెంటర్లలో కోచింగ్ లు తీసుకుంటూ ఇంకెప్పుడు నోటిఫికేషన్ ఇంకెప్పుడు నోటిఫికేషన్ అని ఎదురుచూస్తూ ఎదురుచూస్తూ లక్షల రూపాయలు అప్పులు చేసి వడ్డీలు కడుతూ ఇల్లు వదిలి పట్నానికి ఉద్యోగం కోసం పనమైన నిరుద్యోగుల పరిస్థితి రోజురోజుకు దారుణంగా మారింది. కనీసం హాస్టల్ ఫీజులు కట్టలేక తినడానికి తిండిలేక మూడు పూటల భోజనం ఒక పూటకు కుదించుకుని కష్టపడుతున్న నిరుద్యోగులకు నీళ్లు నిధులు నియామకాలు అని సాధించుకున్న తెలంగాణలో ఆఖరికి కన్నీరే మిగిలింది.

**త్వరలో త్వరలో నోటిఫికేషన్ అని మొసలి కన్నీరు కారుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం...!**

**నిరుద్యోగులు అంటే రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు అంత చిన్నచూపు...!**

త్వరలో త్వరలో అని నిరుద్యోగులను కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని నిరుద్యోగులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఖాళీగా ఉన్న 20 వేల పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్, గ్రూప్ 1,2,3 4, జిపిఓ, వంటి శాఖలలో ఉన్న అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేసి నూతన నోటిఫికేషన్లు జారీ చేయాలని నిరుద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నిసార్లు ఎన్ని రకాలుగా ప్రభుత్వానికి వినతులు చేసిన రాష్ట్ర ప్రభుత్వం మౌనం పాటిస్తూ కాలయాపన చేస్తుందని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో భాగంగా జాబ్ క్యాలెండర్ను విడుదల చేసి తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులందరికీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, లేదంటే మరో తెలంగాణ ఉద్యమం తప్పదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్న తెలంగాణ నిరుద్యోగులు.



# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ డివిజన్‌లో ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మాజీ డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల సంరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల, మున్సిపల్, డివిజన్, కార్పొరేషన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, చైర్మన్లు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డిని ఓడించి బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తాం


- రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనం కొడంగల్ నియోజకవర్గం నుండే మొదలవుతుంది
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఎస్ ఐఆర్ అవగాహన సమావేశం
- మాజీ మంత్రులు సబితా ఇంద్రా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్వర్ రెడ్డి, మెతుకు ఆనంద్

**జయభేరి, షాద్ నగర్. జూన్ 19 :**



కాంగ్రెస్ ప్రభుత్వ పతనం కొడంగల్ నియోజకవర్గం నుండే మొదలవుతుందని,ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ గెలుపు కొడంగల్ నియోజకవర్గం నుండి మొదలు కానుందని,ఈ అసమర్థత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఓడించి బీఆర్ఎస్ జెండాను కొడంగల్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఎగరవేసి కేసీఆర్ గారిని మరొకసారి ముఖ్య మంత్రిగా చేసుకుందామని కొడంగల్ సభ్యత్వ నమోదు ఎస్ ఐ ఆర్ అవగాహన సమావేశంలో కొడంగల్ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. కొండంగల్ పట్టణ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఎస్ ఐ ఆర్ అవగాహన సమావేశంలో మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి,మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్వర్ రెడ్డి,మెతుకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొడంగల్ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ ఇంచార్జ్ ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ...... బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పార్టీ సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపడుతునే ఎస్ ఐ ఆర్ సర్వే పట్ల అవగాహన ఉండాలని సర్వే సమయంలో సరైన సమాచారం ఇవ్వకపోతే ఓటు జాబితా నుండి పేరు తొలగిపోయే ప్రమాదం ఉందనే ఈ విషయాని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గ్రహించాలని బూత్ స్థాయిలో మన ఓటర్ల పేర్లు జాబితాలో నమోదు అయి ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని తెలియ జేశారు. ఈ సమావేశంలో కొడంగల్ నియోజకవర్గ మాజీ జడ్పిటిసిలు, మాజీ ఎంపిపిలు, సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులను ఆశీర్వదించిన రామావత్ రమేష్ నాయక్



**జయభేరి, కొండమల్లెపల్లి :**

కొండమల్లేపల్లి పట్టణంలోని KMR గార్డెన్ లో కొండమల్లేపల్లి 11 వార్డు మెంబర్ వసుక్కుల శీను స్వప్న దంపతుల చిన్నారులు నోయెల్,రాయల్ చిన్నారుల నూతన పట్టు వస్త్రాలంకరణ మహోత్సవంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు రామావత్ రమేష్ నాయక్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. వారితోపాటు A.E చందు నాయక్ 12 వార్డ్ మెంబర్ వెంకటయ్య, బుర్రి నవీన్, హరి , కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ సరోవర్ ప్రాజెక్టు కు అనుమతి

- కేంద్రమంత్రి, రక్షణ శాఖ అధికారులకు సీఎం రేవంత్ కృతజ్ఞతలు

**జయభేరి, హైదరాబాద్ :**

మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో భాగంగా హైదరాబాద్ నగరంలోని బాపూ ఘాట్ వద్ద తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు పనులను చేపట్టేందుకు అనుమతి మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రిరాజ్నాథ్ సింగ్ కి, భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు అనుమతి లభించడం, తెలంగాణ ప్రభుత్వ విజన్ లక్ష్యాలను సాధించడంలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మూసీ నది సమగ్ర పునరుజ్జీవనం, నదీ తీర ప్రాంతాల అభివృద్ధి, అలాగే ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే పర్యావరణ, సాంస్కృతిక, సామాజిక వనరుల సృష్టి దిశగా ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఈ నిర్ణయం మరింత బలాన్ని చేకూరుస్తుందని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టు ద్వారా మూసీ నది పరివాహక ప్రాంతం పర్యావరణపరంగా పునరుజ్జీవం పొందడమే కాకుండా ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రజా స్థలాలు, సాంస్కృతిక కేంద్రాలు, పర్యాటక ఆకర్షణలు అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, భారత సైన్యం అందిస్తున్న సహకారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు.

# మామను హత్య చేసిన అల్లుడి అరెస్ట్

**జయభేరి, కృష్ణా జిల్లా :**

ఈడుపుగల్లు గ్రామంలో స్థలం వివాదంలో మామను హత్య చేసిన అల్లుడని పోలీసులు అరెస్టు చేసారు. డీఎస్పీ ధర్మేంద్ర మాట్లాడుతూ చిల్లర కొట్టు పెట్టేందుకు ఉప్పాల సాంబశివరావు మట్టి చదును చేస్తుండగా అతని తమ్ముడి అల్లుడు బోలెం శ్రీనివాసరావుతో వివాదం మొదలైంది. ఈ వివాదం ఘర్షణకు దారి తీయడంతో శ్రీనివాసరావు విచక్షణారహితంగా సాంబశివరావు చాతిపై, ముఖంపై పిడుగులు గుద్దాడు . ఈ ఘటనలో సాంబశివరావు ఘటన స్థలంలోని మృతి చెందాడు. పరారైన శ్రీనివాసరావు కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు మరుసటి రోజు సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

# గుండ్లపోచంపల్లి రహదారిపై ట్రాఫిక్ తిప్పలు

- ఇరుకైన రోడ్డు, వాహనదారుల అవస్థలు

**జయభేరి, మేడ్చల్ :**

నగర శివారు ప్రాంతాల్లో వేగంగా పెరుగుతున్న జనాభా, నివాస కాలనీల విస్తరణకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మేడ్చల్ సర్కిల్ గుండ్లపోచంపల్లి నుండి మైసమ్మగూడా వెళ్లే ప్రధాన రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ స్థానికులకు నిత్యం తలనొప్పిగా మారింది.

హైదరాబాద్‌కు అత్యంత సమీపంలో ఉన్న గుండ్లపోచంపల్లి డివిజన్‌లో గత కొన్నేళ్లుగా అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, నివాస కాలనీలు పెద్ద ఎత్తున ఏర్పడటంతో జనాభా గణనీయంగా పెరిగింది. దీంతో వాహనాల సంఖ్య కూడా విపరీతంగా పెరిగి రహదారిపై ఒత్తిడి అధికమైంది. అయితే పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టకపోవడంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. రోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్ సమస్య ఈ మార్గంలో ఇప్పటికే రహదారి ఇరుకుగా ఉండగా, రోడ్డు మధ్యలో ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ దెబ్బతిని మరమ్మతులకు నోచుకోకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. ప్రమాదం జరగకుండా ఉండేందుకు వాహనదారులు మ్యాన్‌హోల్ వద్ద వేగం తగ్గించడం,



పక్కకు మళ్లించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా ఉదయం కార్యాలయ సమయాల్లో, సాయంత్రం తిరుగు ప్రయాణ వేళల్లో భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి. తరచూ ప్రమాదాలు ట్రాఫిక్ రద్దీతో పాటు రహదారిపై ఉన్న ఈ సమస్య కారణంగా చిన్నపాటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనదారులు మ్యాన్‌హోల్‌ను తప్పించుకునే క్రమంలో అదుపు తప్పి పడిపోవడం, ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొట్టే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యమే కారణమా?**

సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా రోడ్డు విస్తరణ, దెబ్బతిన్న మ్యాన్‌హోల్ మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంలో అధికారులు చొరవ చూపడం లేదని విమర్శిస్తున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా రహదారిపై ఉన్న మ్యాన్‌హోల్‌ను తక్షణమే మరమ్మతు చేయడంతో పాటు, గుండ్లపోచంపల్లి-మైసమ్మగుడా మార్గాన్ని విస్తరించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు స్పందించి అవసరమైన చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అభివృద్ధి వేగంగా జరుగుతున్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల విస్తరణ కూడా అదే స్థాయిలో జరగకపోతే ప్రజల ఇబ్బందులు మరింత పెరుగుతాయి. గుండ్లపోచంపల్లి-మైసమ్మగూడా రహదారి పరిస్థితి ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది.



## వర్తక సంఘాన్ని రద్దు చేసి షాపులకు టెండర్లు వేయాలి

**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 19 :**

యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేసి షాపులకు వెంటనే టెండర్లు వేయాలని యాదాద్రి పరిరక్షణ కమిటీ సభ్యుడు డిమాండ్ చేశారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని పాదాల దగ్గర కరపత్రాలను విడుదల చేసి పోస్టు కార్డుల ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు చేశారు. ఈ సందర్భంగా యాదాద్రి పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అతి తక్కువ కిరాయితో కొండపైన దుకాణాలు నిర్వహిస్తూ వాటిని రెన్యువల్ చేసుకుంటూ కొత్తవారికి అవకాశం ఇవ్వకుండా అధిక రేట్లకు అమ్ముతూ భక్తులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. వర్తక సంఘంతో దేవస్థానానికి, భక్తులకు నష్టమే తప్ప లాభం లేదని, కావున తక్షణమే వర్తక సంఘాన్ని రద్దుచేసి స్థానికులకు అందుబాటులో ఉండే విధంగా టెండర్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు, పల్లపు బాలయ్య, బండ రామస్వామి, గ్యాదపాక బాలనర్సయ్య, మాటూరి బాల్లయ్య, పసుపునుటి మురళి, దేవపూజ అశోక్, బండి వాసు, దండబోయిన వీరేష్, బండి అనిల్, గౌడ శ్రీశైలం, కర్రె ప్రవీణ్, సతీష్ బట్, కొన్నె సంజీవ, దొమ్మాట ప్రభాకర్, మందోజు నరేష్, పులగం విజయ్, గ్యాదపాక క్రాంతి కుమార్, కాటబత్తిని సందీప్, కర్రె శ్యామ్, మెరుగు వెంకటేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైమరీ స్కూల్ ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్



**జయభేరి, గుడిపల్లి :**

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గుడిపల్లి నందు గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా ప్రీ ప్రైమరీ స్కూల్ (LKG ,UKG తరగతులు)ని ప్రారంభించడం జరిగింది. ఇట్టి అవకాశాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని తమ పిల్లల భవిష్యత్తుకు పునాది లాంటి మన ప్రాథమిక పాఠశాలలో చేర్పించి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నాము. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కున్రెడ్డి రాజశేఖర్ రెడ్డి , మండల విద్యాధికారి సముద్రాల శ్రీనయ్య , గ్రామ పంచాయతీ సెక్రెటరీ విజయ్ రెడ్డి , ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండ జిల్లా సర్పంచుల ఫోరం కన్వీనర్ గా నియామకం



**జయభేరి, గుడిపల్లి :**

ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ తరపున గుడిపల్లి గ్రామ సర్పంచ్ గా 500 ఓట్ల మెజార్టీతో విజయం సాధించిన కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి మీ నీ తెలంగాణ పంచాయతీ రాజ్ సర్పంచ్ల సంగం రాష్ట్ర అధ్యక్షులు చింపుల సత్యనారాయణ రెడ్డి నల్గొండ జిల్లా సర్పంచ్ల ఫోరం కన్వీనర్ గా నియమించినారు. తెలంగాణ సర్పంచ్ల ఫోరం సర్వ సభ్య సమావేశంలో ఈ నియామక పత్రాన్ని అధికారకంగా ప్రకటించినారు. ఈ సందర్భంగా గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నల్గొండ జిల్లా సర్పంచుల ఫోరం కన్వీనర్ గా బాధితుల అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు చింపుల సత్యనారాయణ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసినారు తలపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధితులు నిర్వహిస్తానని. సర్పంచుల సమస్యలపై పోరాడతానని తెలియజేసినారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 19 :**

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం యాదగిరిగుట్ట మండల పరిధిలోని మాసాయిపేట గ్రామంలో పారిశుద్ధ్య పనులు పరిశీలించి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు పలు సూచనలు చేశారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, పాత సామగ్రి, ఇతర ఉపయోగించని వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మాసాయిపేట గ్రామంలోని పాఠశాలను పరిశీలించి కిచెన్ షెడ్, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను నివారించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట వైద్యారోగ్యశాఖ అధికారి మనోహర్, ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## విద్యా వ్యవస్థను రేవంత్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం

**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణలో విద్యా వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుంది అని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.....ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు నేడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు అని ఆయన తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో అనేక కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు అని ఆయన అన్నారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాలి అని ఆయన డిమాండ్ చేశారు. గురుకుల విద్యాసంస్థలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, మౌలిక సదుపాయాల కొరత, సిబ్బంది సమస్యలు, విద్యార్థుల భద్రత వంటి అంశాలను పట్టించుకోకుండా గురుకుల వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాజకీయ ప్రచారాన్ని పక్కనపెట్టి విద్యార్థుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

## అమృత్ పనుల పరిశీలన



**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 19 :**

యాదగిరిగుట్ట పట్టణంలోని అమృత్ 2.0 పథకంలో భాగంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ ను నాణ్యతతో నిర్మించాలని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వర్లు తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంలోని అంగడీ బజార్ లో నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్ ను శుక్రవారం డిప్యూటీ కార్యనిర్వాహక ఇంజనీర్ మనోహర్, యాదగిరిగుట్ట మున్సిపల్ ఛైర్మన్ గుండ్లపల్లి వాణిభరత్ గౌడ్ తో కలిసి పరిశీలించారు. ఆయన వెంట సహాయక కార్యనిర్వాహక ఇంజనీర్ లోకేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

- వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ

**జయభేరి, దేవరకొండ :**



టిపిసిసి యస్సీ విభాగం చెర్మెన్ , మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపు మేరకు నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గ కేంద్రంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (AICC) అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను టిపిసిసి యస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యేకుల రాజారావు ఆధ్వర్యం లో అత్యంత ఘనంగా నిర్వహించారు. రాహుల్ గాంధీ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక వృద్ధాశ్రమంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట ప్రధాన కార్యదర్శి డాక్టర్ యేకుల రాజారావు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, సామాన్యుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం లోని హక్కుల్ని ప్రజలందరికీ అందించడం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. 'భారత్ జోడో యాత్ర' ద్వారా దేశ ప్రజల కష్టాలను తెలుసుకుని, ద్వేషాన్ని వీడి ప్రేమను పంచాలనే గొప్ప ఆశయంతో ఆయన ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఆయన ఆశయాల స్ఫూర్తితోనే దేవరకొండలో వృద్ధులకు సేవ చేస్తూ ఈ జన్మదిన వేడుకలను అర్థవంతంగా నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాహుల్ గాంధీ గారు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశ్రమ వృద్ధులు, నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహా లక్ష్మి మహిళా మండలి అధ్యక్షురాలు గాజుల యాదమ్మ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు యేకుల సురేష్, బోయిని చంద్ర మౌళి, బత్తుల దినకర్, కొరెక్క చెన్నయ్య, దుమ్మిద రమేష్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం వేరొకరికి ప్రాణదానం

- సాయిపేట శ్రీనివాస్
- గాంధీ భవన్‌లో రక్తదాన శిబిరం
- గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ నేతలు

**జయభేరి, హైదరాబాద్, జూన్ 19:**



లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని గాంధీ భవన్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మంత్రి సీతక్క హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్దసంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ స్వయంగా రక్తదానం చేసి యువతకు, పార్టీ కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, మానవీయ విలువలు, సేవాభావానికి ప్రతీకగా నిలిచిన నాయకుడని పేర్కొన్నారు.

దేశంలో సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, పేదలు, రైతులు, యువత, మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడిగా రాహుల్ గాంధీని కొనియాడారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు వేల కిలోమీటర్ల పాదయాత్ర చేసి ప్రజల మధ్యకు వెళ్లిన నాయకుడు రాహుల్ గాంధీ అని ఆయన అన్నారు. రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని, యువత ఎక్కువగా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించబడిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుండ భానుచందర్, శ్రీనివాస్ ముదిరాజ్, మాధవ్ రెడ్డి, కావలి భాస్కర్, బండారి అనిల్, షేబ్బీర్ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు గొప్ప వరం లాంటిది

- తోటకూర వజ్రేష్ యాదవ్

**జయభేరి, మేడ్చల్ :**



సియం సహాయ నిధి పేదలకు గొప్ప వరమని మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ అన్నారు. మేడ్చల్ మండలంలోని గుండ్లపోచంపల్లి కి చెందిన కరికాటి భాస్కర్ కు 60వేలు, ఘనపూర్ కు చెందిన పనిశెట్టి రవి కుమార్ కు 60వేలు, పాసల పిలప్స్ కు 60వేల చెక్కులను వజ్రష్ యాదవ్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వజ్రష్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు గొప్ప వరం లాగా మారిందని, ఎంతోమంది కళ్ళల్లో ఆనందాన్ని నింపుతుందన్నారు, పేదవాడికి సహాయం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు, కాంగ్రెస్ పార్టీ అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పుడు పేద ప్రజల సంక్షేమాన్ని కోరుకుంటారని కూడా ఆయన తెలిపారు,

ఎంతోమంది నిరుపేదలు ఆసుపత్రిలో ఖర్చుల పాలు అవుతున్నారని వారికి ఎంతో కొంత సహాయం అందించే దిశగా ఈ యొక్క సీఎం రిలీఫ్ ఫండ్ వారికి కొంత వరకు మేలు చేసినట్టు అవుతుందని కూడా ఆయన తెలిపారు, అనంతరం గుండ్ల పోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ మాట్లాడుతూ గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో నా దృష్టికి వచ్చిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ ఇతర సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని కూడా సాయిపేట శ్రీనివాస్ తెలిపారు, సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఆపదలో ఉన్నవారికి గొప్ప వరం లాగా ఉందని పేర్కొన్నారు, కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ పేద ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందని కూడా సాయిపేట శ్రీనివాస్ అన్నారు.

ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షులు కుండ భానుచందర్, భాస్కర్, మల్లేష్ వెంకట్ , శ్రీనివాస్, మాధవ్ రెడ్డి, పిలిప్స్, మాజీ సర్పంచ్ బండారి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.


# కన్నులపండువగా ఊంజల్ సేవ

- శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి నిత్యరాబడి రూ.19.69 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, జూన్ 19:**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో శ్రీఆండాల్ అమ్మ వారికి ఊంజల్ సేవను కన్నులపండువగా నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో శ్రీపాంచరాత్రాగమన ప్రకారం కొండపైన అద్దాల మండపంలో ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.





**యాదగిరీశుడికి నిత్యపూజలు..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి శుక్రవారం నిత్యరాబడిలో భాగంగా రూ.19,69,494 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.1,09,300,బ్రేక్ దర్శనం ద్వారా రూ.99,000, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.1,26,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.2,10,000, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.2,27,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.38,800, ప్రసాద విక్రయం ద్వారా రూ.8,08,520, కల్యాణకట్ట ద్వారా రూ.60,000తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.



## ప్రజలు శబ్ద కాలుష్యము వల్ల తీవ్ర ఇబ్బందులు

**జయభేరి, ఉప్పల్ :**

నాచారం డివిజన్ బాబానగర్ కాలనీలో అక్రమంగా నడిపిస్తున్న స్క్రాప్ షాపు వల్ల ఇక్కడి ప్రజలు తీవ్ర శబ్ద కాలుష్యము వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డితో బస్తీ వాసులు పిర్యాదు చేశారు. బాబానగర్ వాసులను MMC కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి వద్దకు ఎమ్మెల్యే తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరడం జరిగింది. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాబా నగర్ బస్తివాసులు మనోజ్, పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**జయభేరి, మేడిపల్లి :**

పీరజాదిగూడ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ బస్ డిపో వద్ద రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ -మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ హాజరై కేక్ కట్ చేసి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ శివ గౌడ్, మాజీ గ్రంధాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ ఏనుగు జలంధర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, కంటెస్టెడ్ కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జి లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుట్కా, పాన్, సిగరెట్లు, పొగాకుల తనిఖీలు



**జయభేరి, హుజూరాబాద్ :**

కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్‌లో విద్యాసంస్థల సమీపంలో COTPA 2003 చట్టాన్ని ఉల్లంఘిస్తూ పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్న దుకాణాలపై పోలీసులు, స్థానిక అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చట్టప్రకారం స్కూళ్లు, కాలేజీలకు 100 మీటర్ల పరిధిలో గుట్కా, పాన్, సిగరెట్లు అమ్మడం నేరమని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలు మీరితే భారీ జరిమానాలతో పాటు క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ఎక్కడైనా ఇలాంటి అక్రమ విక్రయాలు జరిగితే వెంటనే పోలీసులకు లేదా స్థానిక అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

**COTPA చట్టం ఏం చెబుతోంది?**

భారత ప్రభుత్వ నిబంధనల ప్రకారం, 'సిగరెట్లు మరియు ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం' (COTPA) 2003 సెక్షన్ 6 ప్రకారం.. ఎలాంటి స్కూళ్లు, కాలేజీలు, కోచింగ్ సెంటర్ల లాంటి విద్యాసంస్థలకు 100 మీటర్ల (100 గజాల) పరిధిలో పొగాకు ఉత్పత్తులను విక్రయించడం పూర్తిగా నిషేధం. యువత మరియు విద్యార్థులు చిన్న వయసులోనే చెడు అలవాట్లకు బానిసలు కాకుండా ఉండేందుకే ఈ కఠినమైన చట్టాన్ని తెచ్చారు.

## ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు

- వర్షాకాల సన్నద్ధతపై సమన్వయ సమావేశంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**



వర్షాకాల సన్నద్ధతపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం (నాచారం సర్కిల్ )మల్లాపూర్ వార్డ్ కార్యాలయం లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ వ్యవస్థ, నాలాల శుభ్రత, రోడ్ల మరమ్మతులు, నీటి నిల్వలు, విద్యుత్ సరఫరా, తాగునీటి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అన్ని లైన్ డిపార్ట్‌మెంట్‌ల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి, వర్షాల కారణంగా తలెత్తే సమస్యలను వెంటనే పరిష్కరించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల ఫిర్యాదులపై వెంటనే స్పందించి, అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొని వర్షాకాల సన్నద్ధతకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీ నిత్యానంద్, ఈ ఈ రమేశ్ బాబు, వాటర్ వర్క్స DGM వేణు గోపాల్, హైడ్రా అధికారులు, అన్ని శాఖల అధికారులు BRS పార్టీ, కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మ్యారేజ్ పై వార్ ఎఫెక్ట్

**జయభేరి, హైదరాబాద్, జూన్ 19 :**

తెలుగు రాష్ట్రాల్లో శుభకార్యాల సీజన్ మళ్లీ మొదలైంది. అధిక జేష్ఠ మాసం ముగిసింది. దీంతో శుభకార్యాలు మొదలయ్యాయి. జూలై 9 వరకు వివాహాలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలకు సంబంధించి అనుకూలమైన ముహూర్తాలు ఉన్నాయి. దాదాపు నెల రోజుల తర్వాత మళ్లీ శుభకార్యాల సీజన్ మొదలైంది. ఈనెల 15 నుంచి జూలై 9 వరకు పరిమిత శుభ ముహూర్తాలు ఉండడంతో.. వివాహాలు, గృహప్రవేశాలకు ముహూర్తాలు డిసైడ్ చేస్తున్నారు. జూలై 15 నుంచి ఆషాడమాసం, గురు మూఢం ప్రారంభం అవుతుంది. మళ్లీ ఆగస్టు 15 వరకు ముహూర్తాలు లేవు. మళ్లీ శ్రావణమాసంలోనే ముహూర్తాలు ఉన్నాయి.జూలై 9లోపు వేలాది వివాహాలు నిశ్చయం అయినట్లు తెలుస్తోంది తెలుగు రాష్ట్రాల్లో. జూన్ తో పాటు జూలై నెలలో ఈ ముహూర్తాలు కొనసాగనున్నాయి. ప్రధానంగా జూన్ 19, 20, 21, 22, 24, 25, 26, 27, 28 తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. మరోవైపు జూలైలో 1, 6, 7, 9 తేదీలు కూడా ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు. పరిమిత ముహూర్తాలు కావడంతో అటు పురోహితులు, ఫంక్షన్ హాల్, క్యాటరింగ్ కు విపరీతమైన డిమాండ్ ఉంది. ముఖ్యంగా పురోహితులను ముందే మాట్లాడుకుంటున్నారు.మార్కెట్లో అన్ని రకాల ధరలు పెరిగాయి. దానికి కారణం యుద్ధం గా చూపుతున్నారు. ఇప్పుడు వివాహాలకు సంబంధించిన అన్ని రకాల ధరల పెరుగుదలకు యుద్ధం కారణమని చెబుతున్నారు. డెకరేషన్ తో పాటు ఇతర ఖర్చులు కూడా పెరిగాయి. డీజిల్ తో పాటు పెట్రోల్ ధరలు పెరగడంతో వాహనాల కిరాయి పెంచేశారు. నిత్యవసర వస్తువులతో పాటు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలు పెరగడంతో.. క్యాటరింగ్ నిర్వాహకులు తమ ధరలను పెంచేశారు. ఇక ప్లేటు భోజనం ధర కూడా పెరిగింది. గతంలో ఐదు లక్షల రూపాయల వరకు ఖర్చు చేసేవారు. ఇప్పుడు పది లక్షల రూపాయలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. శుభకార్యాలు అంటేనే ప్రధానంగా బంగారం కీలక పాత్ర పోషిస్తూ వస్తోంది. కానీ సామాన్యులు కొనలేని స్థితిలో బంగారం ధరలు ఉన్నాయి. సాధారణంగా ఒక వివాహానికి ఐదు నుంచి పది తులాల బంగారం కొనుగోలు చేస్తుంటారు. ఆ లెక్కన కూడా దాదాపు 20 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుంది వివాహాలకు. ఇలా ఎలా చూసుకున్నా శుభకార్యాలకు సైతం యుద్ధం ఎఫెక్ట్ తప్పడం లేదు.



## లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**జయభేరి, మేడ్చల్ :**




మేడ్చల్ నియోజకవర్గం మేడ్చల్ డివిజన్‌లో ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మాజీ డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మండల, మున్సిపల్, డివిజన్, కార్పొరేషన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, చైర్మన్లు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాయదుర్గంలో టెస్లా షోరూమ్ ప్రారంభం

- హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్

**జయభేరి, హైదరాబాద్ :**



ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ Tesla హైదరాబాద్‌లో తన తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. రాయదుర్గం సమీపంలోని హైటెక్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం తెలంగాణలో టెస్లా తొలి షోరూమ్‌గా నిలిచింది. ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన టెస్లా సంస్థ రాయదుర్గం పరిసర ప్రాంతంలో తన తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సత్వ నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో టెస్లా మోడల్ వై, మోడల్ వై ఎల్ వాహనాలను ప్రదర్శనకు ఉంచారు. వాహనాల పనితీరు, అత్యాధునిక సాంకేతికత, భద్రతా ఫీచర్లు, ఛార్జింగ్ సదుపాయాలపై వినియోగదారులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించనున్నారు. భారత మార్కెట్లో విస్తరణలో భాగంగా టెస్లా హైదరాబాద్‌లో అడుగుపెట్టడం నగరంలోని ఎలక్ట్రిక్ వాహనాల రంగానికి కొత్త ఊపు తీసుకురానుంది. ఐటీ ఉద్యోగులు, యువత, ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి ఉన్న వినియోగదారులను ఆకర్షించేలా ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను రూపొందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.



# మహిళల ఆరోగ్యానికి ఇవి శ్రీరామ రక్ష..

## రోజూ తీసుకుంటే ఊహించని అద్భుతాలు..

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మహిళలు రెట్టింపు బాధ్యతలను మోస్తున్నారు. అటు ఆఫీసు పని, ఇటు ఇంటి బాధ్యతలను చక్కబెట్టే క్రమంలో తమ సొంత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం పరిపాటిగా మారింది. ఫలితంగా చిన్న వయసులోనే తీవ్రమైన అలసట, హార్మోన్ల అసమతుల్యత, ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలు చుట్టుముడుతున్నాయి. అయితే వీటన్నింటికీ మన పురాతన ఆయుర్వేదంలో అద్భుతమైన పరిష్కారాలు ఉన్నాయని ప్రముఖ హెల్త్ కోచ్ డింపుల్ జాంగ్డా సూచిస్తున్నారు. ప్రతి మహిళ తన ఆహారంలో భాగం చేసుకోవాల్సిన మూడు ముఖ్యమైన మూలికల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**అశ్వగంధ**

అశ్వగంధను కేవలం పురుషులకే పరిమితమైన మూలికగా చాలామంది భావిస్తారు. కానీ ఇది మహిళలకు ఒక సంజీవని లాంటిది. దీనిని అడాప్టోజెన్ అని పిలుస్తారు. ఇది శరీరంలో ఒత్తిడిని పెంచే కార్టిసాల్ హార్మోన్ స్థాయిలను తగ్గించి, నాడీ వ్యవస్థను ప్రశాంతపరుస్తుంది. థైరాయిడ్ గ్రంధి పనితీరును మెరుగుపరచడంలో, శరీరానికి తక్షణ శక్తిని ఇవ్వడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. మార్కెట్లో లభించే అశ్వగంధ పొడిని గోరువెచ్చని పాలలో కలుపుకుని లేదా హెర్బల్ టీ రూపంలో తీసుకోవచ్చు.

**శతావరి (ఆస్పరాగస్): స్త్రీలకు అసలైన నేస్తం**

ఆయుర్వేదంలో శతావరికి ఉన్న ప్రత్యేకతే వేరు. వంద రోగాలను నయం చేసే శక్తి దీని సొంతం. పీసీఓఎస్, సంతానలేమి, క్రమరహిత రుతుస్రావం వంటి సమస్యలతో బాధపడే మహిళలకు శతావరి అద్భుతంగా పనిచేస్తుంది. ఇది శరీరంలో ఈస్ట్రోజెన్ స్థాయిలను క్రమబద్ధీకరిస్తుంది. మీరు గర్భం దాల్చాలని ప్లాన్ చేస్తున్నా లేదా మెనోపాజ్‌లో ఉన్నా, శతావరి హార్మోన్లను అదుపులో ఉంచుతుంది. బాలింతలలో పాల ఉత్పత్తిని పెంచడానికి కూడా ఇది సహాయపడుతుంది. శతావరి పొడిని పాలు లేదా తేనెతో కలిపి రోజుకు ఒకసారి తీసుకోవడం శ్రేయస్కరం.

**తులసి: మానసిక ఉల్లాసానికి మారుపేరు**

ప్రతి ఇంట్లో ఉండే తులసి కేవలం పూజకే కాదు, ఔషధ గుణాల గని కూడా. తులసి శరీరంలో సెరోటోనిన్ విడుదలకు దోహదపడుతుంది. ఇది ఆందోళన, నిరాశను దూరం చేసి మనసును ఉల్లాసంగా ఉంచుతుంది.ఇది శరీరంలోని జీర్ణ అగ్నిని ప్రేరేపించి, జీవక్రియను వేగవంతం చేస్తుంది. దీనివల్ల బరువు తగ్గాలనుకునే వారికి, నీరసంగా ఉండేవారికి మంచి ఫలితం ఉంటుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో 34 ఆకులను నమలడం లేదా తులసి టీ తాగడం వల్ల ఊపిరితిత్తులు, జీర్ణాశయం ఆరోగ్యంగా ఉంటాయి.

**ముఖ్య గమనిక: నిపుణుల సూచన**

ఆయుర్వేద మూలికలు సహజమైనవే అయినప్పటికీ, ప్రతి ఒక్కరి శరీర తత్వం వేరుగా ఉంటుంది. కాబట్టి వీటిని మీ దినచర్యలో భాగం చేసుకునే ముందు ఒకసారి ఆయుర్వేద వైద్యుడిని సంప్రదించడం ఉత్తమం. ముఖ్యంగా గర్భిణీలు, ఇతర మందులు వాడుతున్న వారు సరైన మోతాదు కోసం నిపుణుల సలహా తీసుకోవాలి.
ఆరోగ్యం అనేది బాధ్యత మాత్రమే కాదు, అది ఒక పెట్టుబడి. మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి పెట్టినప్పుడే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ మూడు మూలికలను సరైన పద్ధతిలో వాడి సహజసిద్ధమైన ఆరోగ్యాన్ని మీ సొంతం చేసుకోండి.



# ఆరోగ్యకరమైన కళ్లను పొందండి!

### స్పష్టమైన కంటిచూపు కోసం 7 సులభమైన టిప్స్..

ప్రస్తుతం డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర స్క్రీన్‌లు ఉపయోగించడం అనేది కంటి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్న విషయం తెలిసిందే. మనం ఎక్కువ సేపు స్క్రీన్‌ను చూసినా, కంటి కండరాలు అలసిపోతాయి, కళ్ళు పొడిబారతాయి. అంతేగాక, చూపు సమస్యలు పెరిగిపోతాయి. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం సరైన జీవనశైలి, పోషకాహారం, కొన్ని చిట్కాలు పాటించాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

**1. 20-20-20 సూత్రం:**

అందరికీ తెలిసిన 202020 రూల్‌ని పాటించడం ద్వారా స్క్రీన్ చూడడం వల్ల కంటి కండరాలపై పడ్డ ఒత్తిడిని తగ్గించవచ్చు.
ప్రతి 20 నిమిషాలకు స్క్రీన్ చూడటం ఆపాలి. కనీసం 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును 20 సెకన్ల పాటు గమనించాలి. ఈ అలవాటు కంటి కండరాలకు విశ్రాంతి ఇచ్చి, కళ్ళు పొడిబారడం, అలసటను తగ్గిస్తుంది.

**2. సరైన భంగిమ:**

స్క్రీన్ కళ్లకు కనీసం ఒక చేతి దూరంలో ఉండాలి. స్క్రీన్ కంటి స్థాయికి కాస్త దిగువగా ఉండేలా పొజిషన్ చేయాలి. గదిలో తగినంత వెలుతురు ఉండాలి, మరీ చీకటి లేదా మరీ ఎక్కువ కాంతి ఉండకూడదు.

**3. కనురెప్పలు వాల్చడం:**

స్క్రీన్ ఉపయోగిస్తున్నప్పుడు కనురెప్పలు సరిగ్గా వాల్చడం చాలా ముఖ్యం. మీరు కనీసం 60% తక్కువగా కనురెప్పలు వాల్చే అవకాశం ఉంటుంది. కనురెప్పలు వాల్చడం వల్ల కళ్ళు తేమగా ఉంటాయి, కళ్ల పొడిబారడం తగ్గుతుంది.

**4. నిద్ర, హైడ్రేషన్:**

ప్రతిరోజూ 7-9 గంటల పాటు నిద్రపోవాలి. నిద్రలేమి వల్ల కళ్ళలో పొడిబారడం, కనురెప్పలు అవడం, దృష్టి మసకబారడం వంటి సమస్యలు వస్తాయి. ప్రతిరోజూ 8-10 గ్లాసుల నీరు తాగాలి. డీహైడ్రేషన్ వల్ల కూడా కళ్ళు పొడిబారతాయి.

**5. UV రక్షణ:**


బయట ఉన్నప్పుడు UV రక్షణ ఉన్న సన్‌గ్లాసెస్ ధరించండి. ఇది కంటి శుక్లాలు, రెటీనా సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**6. పోకాహారం**

కంటి ఆరోగ్యం ఆహారంపై ఆధారపడి ఉంటుంది. కంటికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన పోషకాలు:
**విటమిన్ A:** క్యారెట్లు, బొప్పాయి
**లూటిన్ & జింక్:** ఆకుకూరలు (పాలకూర), గింజలు
**ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్:** చేపలు, వాల్‌నట్స్, విత్తనాలు
**సిట్రస్ పండ్లు:** నారింజ, నిమ్మ

**7. కంటి వ్యాయామాలు**

**కనురెప్పలు ఆర్పడం:** కళ్ళను 10-15 సార్లు వేగంగా ఆర్పండి. ఆ తర్వాత కళ్ళు మూసి విశ్రాంతి తీసుకోండి.
**కనుబొమ్మలను తిప్పడం:** కళ్ళను నెమ్మదిగా వృత్తాకారంలో తిప్పండి. మొదట క్లాక్ వైజ్, తర్వాత యాంటీ క్లాక్ వైజ్.
**దృష్టిని మార్చడం:** మీ బొటనవేలును ముఖం దగ్గర ఉంచి దానిపై దృష్టి పెట్టండి, తర్వాత దూరంగా ఉన్న వస్తువుపై దృష్టి పెట్టండి.
ఈ చిట్కాలు కంటిపై ఒత్తిడిని తగ్గించి, చూపు దెబ్బతినకుండా కాపాడతాయి. అయితే, కంటి సమస్యలు సీరియస్‌గా మారితే.. వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.





# మీ పొట్ట కొవ్వు కరగాలంటే ఏది బెస్ట్ ఎక్సర్‌సైజ్?

ఆరోగ్యంగా ఉండాలన్నా, బరువు తగ్గాలన్నా వ్యాయామం తప్పనిసరి. అందులోనూ వాకింగ్, రన్నింగ్ అత్యంత ప్రజాదరణ పొందిన మార్గాలు. అయితే, వీటిలో ఏది త్వరగా ఫలితాన్ని ఇస్తుంది? ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయిన మొండి కొవ్వును కరిగించడానికి ఏ వ్యాయామం ఎలా సహాయపడుతుంది.? వయస్సు, ఫిట్‌నెస్ స్థాయి, ఆరోగ్య స్థితిని బట్టి ఏది ఎంచుకోవాలో ఈ చిట్కాలు స్పష్టం చేస్తాయి. బరువు తగ్గడానికి సిద్ధమవుతున్న వారికి ఇది ఒక సరైన గైడ్.మీ శరీరానికి ఏది సరిపోతుంది? అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

**కేలరీల ఖర్చు:**

సాధారణంగా ఒక గంట పాటు వేగంగా నడవడం వల్ల సుమారు 200 నుండి 300 కేలరీలు ఖర్చవుతాయి. అదే ఒక గంట పాటు రన్నింగ్ చేస్తే 500 నుండి 800 కేలరీలు వరకు కరిగించవచ్చు. అంటే, తక్కువ సమయంలో ఎక్కువ కేలరీలు ఖర్చు చేయాలంటే రన్నింగ్ ఉత్తమ ఎంపిక.

**పొట్ట కొవ్వుపై ప్రభావం:**

పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును కరిగించడానికి రన్నింగ్ చాలా వేగంగా పనిచేస్తుంది. ఇది శరీరంలోని మెటబాలిజం రేటును పెంచి, వ్యాయామం ముగిసిన తర్వాత కూడా కేలరీలు ఖర్చయ్యేలా చేస్తుంది. అయితే, నడక వల్ల కూడా క్రమంగా కొవ్వు తగ్గుతుంది, కానీ దీనికి ఎక్కువ సమయం పడుతుంది.

**నడక:**

వయసు పైబడిన వారు, అధిక బరువు (Obesity) ఉన్నవారు, కీళ్ల నొప్పులు లేదా గుండె సమస్యలు ఉన్నవారికి నడక సురక్షితం. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది.

**పరుగు:**

వేగంగా బరువు తగ్గాలనుకునే యువకులు, ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేనివారు రన్నింగ్ ఎంచుకోవచ్చు. ఇది ఎముకల బలాన్ని పెంచుతుంది.

**జాగింగ్ vs రన్నింగ్:**

రన్నింగ్ కంటే కొంచెం తక్కువ వేగంతో పరిగెత్తడాన్ని జాగింగ్ అంటారు. రన్నింగ్ చేయలేని వారు జాగింగ్‌తో ప్రారంభించి, నెమ్మదిగా వేగాన్ని పెంచవచ్చు.

**ముఖ్యమైన చిట్కాలు:**

ఏదో ఒక రోజు చేయడం కంటే, రోజూ కనీసం 3045 నిమిషాల పాటు వ్యాయామం చేయడం ముఖ్యం. కీళ్లపై ఒత్తిడి పడకుండా ఉండటానికి మంచి వాకింగ్ లేదా రన్నింగ్ షూస్ ధరించాలి. వ్యాయామంతో పాటు సరైన పోషకాహారం తీసుకున్నప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి. మీరు ఇప్పుడే ఫిట్‌నెస్ ప్రయాణాన్ని ప్రారంభిస్తుంటే, నడకతో మొదలుపెట్టి నెమ్మదిగా రన్నింగ్‌కు మారడం మంచిది. మీ లక్ష్యం కేవలం ఫిట్‌నెస్ అయితే నడక సరిపోతుంది. అదే బరువు తగ్గడం అయితే రన్నింగ్ లేదా జాగింగ్ మేలు.



## శుభవార్త చెప్పిన టాలీవుడ్ హీరోయిన్..


పలు తెలుగు సినిమాల్లో నటించిన పూజా ఝావేరి గుడ్ న్యూస్ చెప్పింది. రెండేళ్ల క్రితం ప్రియుడితో కలిసి పెళ్లి పీటలెక్కిన ఈ ముద్దుగుమ్మ త్వరలోనే తల్లిగా ప్రమోషన్ పొందనుంది. ప్రస్తుతం ఆమె నిండు గర్భంతో ఉంది. ఈ శుభవార్తను స్వయంగా పూజనే సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. తన భర్తతో కలిసి బీచ్ ఒడ్డున బేబీ బంప్‌తో తీసుకున్న ఫొటలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఇవి నెట్టింట బాగా వైరలవుతున్నాయి. పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు ఈ ముద్దుగుమ్మకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కాగా గుజరాత్‌లోనే పుట్టి పెరిగింది పూజా ఝావేరి. అక్కడే చదువుకుంది కూడా. అయితే సినిమాలపై ఆసక్తితో సొంతూరిని వదిలేసి ముంబైకు వచ్చేసింది. ఇక 2015లో 'భమ్ భోళేనాథ్' అనే తెలుగు సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైందీ అందాల తార. ఆ తర్వాత రౌడీబాయ్ విజయ్ దేవరకొండతో కలిసి 'ద్వారక', సుమంత్ అశ్విన్ 'రైట్ రైట్', రవితేజ 'టచ్ చేసి చూడు',47 డేస్, బంగారు బుల్లోడు, మాయగాడు, మిక్స్ అప్ తదితర తెలుగు సినిమాల్లో యాక్ట్ చేసింది. అందం, అభినయం పరంగా ఒకే అనిపించుకున్న ఈ ముద్దుగుమ్మ స్టార్ హీరోయిన్ రేంజ్‌కు మాత్రం ఎదగలేకపోయింది. ఈ బ్యూటీ తెలుగు సినిమాల్లో కనిపించి దాదాపు రెండేళ్లు అవుతోంది. చివరిగా గతేడాది వందే భారత్ వయా యూఎస్ ఏ అనే ఓ గుజరాతీ సినిమాలో యాక్ట్ చేసింది పూజ. సినిమాల సంగతి పక్కన పెడితే.. 2024లో ఓ ఎన్నారైని పెళ్లి చేసుకుంది పూజా జవేరి. అప్పుడే తన భర్తతో కలిసి అమెరికాకు వెళ్లిపోయింది. ప్రస్తుతం న్యూయార్క్‌లోనే నివాస ముంటోందీ అందాల తార. సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటోందీ అందాల తార. తన భర్త, ఫ్యామిలీకి సంబంధించిన ఫొటోలను ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తోంది. ఈ ఫొటోలు నెట్టింట తెగ వైరలవుతున్నాయి. నెటిజన్ల నుంచి లైక్స్ ,కామెంట్ల వర్షం కురుస్తుంటుంది.



## కొరియన్ థ్రిల్లర్‌స్‌ని తలపించే యాక్షన్

కథానాయకుడి పాత్రను బోల్డ్‌గా చూపించడం సందీప్‌రెడ్డి వంగా స్టైల్. అంతేకాదు, యాక్షన్‌తో పాటు రొమాన్స్ కూడా పరిధులకు మించే ఉంటుంది. అందుకే యువతరానికి సందీప్‌రెడ్డి వంగా సినిమా అంటే పూనకాలు వచ్చేస్తుంటాయి. అర్జున్‌రెడ్డి, కబీర్‌సింగ్, యానిమల్ సినిమాలతో ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్‌గా అవతరించారు సందీప్. ప్రస్తుతం ఆయన ప్రభాస్‌తో 'స్పిరిట్' సినిమా చేస్తున్నారు. ఇందులో ప్రభాస్ పోలీసాఫీసర్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రభాస్ కాప్‌గా చేయడం ఇదే ప్రథమం. దాంతో అభిమానులు 'స్పిరిట్'కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. ఇప్పటివరకూ ఇండియన్ స్క్రీన్ ఎరుగని యాక్షన్ సీక్వెన్‌స్‌ని 'స్పిరిట్'లో చూడబోతున్నట్టు చిత్రబృందం చెబుతున్నది. 'దురంధర్ 2'ని మించిన యాక్షన్ సీక్వెన్స్ 'స్పిరిట్'లో ఉంటాయట. ఇందులోని యాక్షన్ కొరియన్ థ్రిల్లర్‌స్‌ని తలపిస్తుందని యూనిట్ సభ్యులు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగానే కొరియన్ యాక్షన్ కొరియోగ్రాఫర్లు కూడా 'స్పిరిట్' కోసం పనిచేస్తున్నారట. ఇదిలావుంటే.. ఈ సినిమాలో సంగీతానికి కూడా మంచి ప్రాధాన్యత ఉంటుందని తెలిసింది. హర్షవర్ధన్ రామేశ్వర్ అద్భుతమైన స్వరాలను అందించారని చెబుతున్నారు. ఇటీవలే ప్రభాస్ పరిచయ గీతాన్ని కూడా చిత్రీకరించారట. ప్రభాస్‌కి జోడీగా త్రిప్తి డిమ్రీ నటిస్తున్న ఈ చిత్రంలో వివేక్ ఒబెరాయ్ విలన్‌గా కనిపించనున్న విషయం తెలిసిందే. టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 5న విడుదల కానున్నది.


## ఓ యోధుడి ప్రస్థానం



గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న చారిత్రక చిత్రం 'భరత వర్ష'. సంకల్ప్ దర్శకత్వంలో శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. క్రీ.శ. 642 నేపథ్య కథాంశమిది. శుక్రవారం ఈ సినిమా నుంచి 'వీర జయధీర' అనే తొలిపాటను విడుదల చేశారు. కథానాయకుడి ప్రయాణాన్ని, పరివర్తనను ఆవిష్కరిస్తూ శక్తివంతంగా ఈ పాట సాగింది. ఓ సాధారణ వ్యక్తి నుంచి అసాధారణ యోధుడిగా కథానాయకుడు ఎదిగిన వైనం, లక్ష్యసాధన కోసం చేసిన అతను చేసిన పోరాటాన్ని స్ఫూర్తివంతంగా ప్రజెంట్ చేసింది. అనుదీప్‌దేవ్ అందించిన సంగీతం, చంద్రబోస్ సాహిత్యం ఈ పాటలో ప్రధానాకర్షణగా నిలిచాయి. మంచు పర్వతాల నడుమ విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. హీరో గోపీచంద్ సరికొత్త మేకోవర్‌తో కనిపించారు. ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్‌దేవ్, దర్శకత్వం: సంకల్ప్.

## నేను కావాలని చేయలేదు..!

### ఆ రెండేళ్లు తిండి కూడా తినలేదు.. సమంత ఎమోషనల్ కామెంట్స్



హీరోయిన్ సమంత మా ఇంటి బంగారం సినిమాతో రీఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. మా ఇంటి బంగారం జూన్ 19న(నేడు) ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. ఈ సినిమా పై సమంత అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఈ సినిమాకు పాజిటివ్ టాక్ వస్తుంది.

స్టార్ హీరోయిన్ సమంతకు ఉన్న ఫ్యాన్ బేస్ గురించి, క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. స్టార్ హీరోలకు సమానంగా క్రేజ్ సొంతం చేసుకోవడంతో పాటు రెమ్యునరేషన్ కూడా అందుకుంటుంది. ఏమాయ చేశావే సినిమాతో పరిచయం అయిన సామ్ తక్కువ సమయంలోనే స్టార్ డమ్ సొంతం చేసుకుంది. స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది సామ్. మహేష్ బాబు, పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్, అల్లు అర్జున్ లాంటి స్టార్ హీరోల సరసన సినిమాలు చేసి ఆకట్టుకుంది. అలాగే తమిళ్ లోనూ సినిమాలు చేసి మెప్పించింది. ఇక సామ్ వ్యక్తిగత జీవితం గురించి కూడా ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సామ్ ముందు అక్కినేని యంగ్ హీరో నాగ చైతన్యను ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే.. ఆ తర్వాత ఈ ఇద్దరూ విడిపోయారు.

నాగ చైతన్య, సామ్ విడకులు అనౌన్స్ చేయడంతో ఫ్యాన్స్ షాక్ అయ్యారు. ఇక విడిపోయిన తర్వాత ఇద్దరూ మరొకరిని పెళ్లి చేసుకున్నారు. అలాగే ఎవరి సినిమాలతో వారు బిజీగా ఉన్నారు. సమంత ఇటీవలే నిర్మాతను రాజ్ నిడిమోరును పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే.. పెళ్లి తర్వాత హ్యాపీలైఫ్ లీడ్ చేస్తుంది సామ్. సమంత ప్రస్తుతం తిరిగి సినిమాల పై దృష్టి పెట్టింది. ఇప్పుడు నందిని రెడ్డి దర్శకత్వంలో మా ఇంటి బంగారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

ఈ సినిమా నేడు (19న) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇదిలా ఉంటే తాజాగా సమంత తన డైట్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. సమంత లుక్ పై గతకొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై సామ్ మాట్లాడుతూ.. మయోసైటిస్ వల్ల తాను భోజనం విషయంలో చాలా జాగ్రత్త తీసుకోవాల్సి వచ్చిందని తెలిపింది. అలాగే నచ్చింది తింటే తన ఇమ్యూనిటీ పై చాలా ప్రభావం చూపిందని తెలిపింది సమంత. చాలామంది నన్ను ఎప్పుడూ ఒకటే అడుగుతుంటారు. అంత స్లిమ్ గా ఎలా మారారు.? ఎందుకు అంత బరువు తగ్గిపోయారు అని అడుగుతుంటారు. అవతలి వ్యక్తి జీవితంలో ఏం జరుగుతుందో ఎవరికీ పూర్తిగా తెలియదు. నేను కావాలని డైట్ చేయలేదు.. కావాలని బరువు తగ్గలేదు.. నాకు తినాలని ఉన్నా కూడా తినలేకపోయా..ఆ రెండేళ్లు నరకంగా అనిపించింది. ప్రస్తుతం తాను కోలుకున్నానని, ఇప్పుడు నచ్చిన ఫుడ్ తింటున్నా కానీ అతిగా ఏది తీసుకోవడం లేదు అని తెలిపింది సమంత. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.



## హీరోయిన్‌గా.. నాగ దుర్గకు క్రేజీ ఆఫర్స్

ఈ అమ్మడి సాంగ్స్ యూట్యూబ్ లో మిలియన్ వ్యూస్ సొంతం చేసుకుంటూ దూసుకుపోతున్నాయి. ఫోక్ సాంగ్స్ తో పాటు పలు ఇంటర్వ్యూల్లోనూ పాల్గొంటుంది ఈ చిన్నది. నాగ దుర్గ సాంగ్స్ కోసం ఆడియన్స్ ఈగర్ గా ఎదురుచూస్తుంటారు. రీసెంట్ గాను లగారే సౌండ్ సాలా అనే సాంగ్ తో అభిమానులను ఆకట్టుకుంది. ఒకటి కాదు రెండు కాదు.. వందల పాటలలో ప్రధాన పాత్రలో కనిపిస్తూ తమకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది నాగ దుర్గ . పల్లె పాటలకు ఎనర్జిటిక్ డ్యాన్సులతో అదరగొడుతుంది. కేవలం డాన్సర్‌గానే కాకుండా, తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, విభిన్నమైన కాస్ట్యూమ్స్‌తో సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారారు. ఇక ఇప్పుడు హీరోయిన్ గా మారిపోయింది నాగ దుర్గ. ఈ అందాల భామకు తెలుగులో కాదు తమిళ్ లోనూ ఛాన్స్ అందుకుంది. ఏకంగా ధనుష్ మేనల్లుడి సినిమాలో హీరోయిన్ గా ఛాన్స్ దక్కించుకుంది. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ మేనల్లుడు పవీష్.. జాబిలమ్మ నీకు అంత కోపమా సినిమాతో.. తెలుగులోనూ గుర్తింపు తెచ్చుకున్నాడు. అయితే ఈయన హీరో గా రెండో ప్రాజెక్ట్ స్టార్ట్ అయింది. ఈ సినిమాలో నాగ దుర్గ హీరోయిన్ గా నటిస్తుంది. పవీష్ రెండో సినిమాకు కొత్త డైరెక్టర్ మగేష్ రాజేంద్రన్ దర్శకత్వం వహించనున్నారు. ఆయన గతంలో తమిళంలో వచ్చిన బోగన్ సినిమాకు డైరెక్షన్ డిపార్ట్ మెంట్‌లో పనిచేశాడు. ఇక ఇప్పుడు దర్శకుడిగా సినీరంగంలోకి అడుగు పెట్టబోతున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్ విడుదల చేశారు. ఈ సినిమాకు లవ్ ఓ లవ్ అనే ఇంట్రెస్టింగ్ టైటిల్ ను ఖరారు చేశారు. ఈ సినిమా తర్వాత నాగ దుర్గ తెలుగులోనూ మంచి అవకాశాలు అందుకోవడం ఖాయంగా కనిపిస్తుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**